ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం


నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, మే 3, 2026 | సంపుటి - 22 | సంచిక 214 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు

- ఎల్‌ఐసిలో మాత్రం 20శాతానికే పరిమితం
- చట్టంలో మార్పులపై కేంద్రం నోటిపై
- భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో విదేశీ పెట్టుబడిలకు మార్గం సుగమం




2



## హర్మూజ్ మా ఆధీనంలోనే ఉంటుంది

- ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన
- జలసంధిపై కొత్త నియమాలు



**టెహ్రాన్, నినాదం:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు.

6

## ఇరాన్‌పై సైనిక చర్యకు దిగుతాం

- ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు
- మరోమారు మెలిక పెట్టిన ట్రంప్



పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

6

## సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు

- ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం



**న్యూఢిల్లీ, నినాదం:** సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

- ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు
- సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు మొదటి అంతర్జాతీయ మిషన్

2




# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు చెల్లింపు
- జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
- ఉద్యోగ సంఘాలతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మే2(నినాదం):**

వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు.

▸▸తరువాయి 2లో..

## సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

- వేధింపులకు గురిచేయడం సరికాదు
- ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

**హైదరాబాద్, నినాదం:** కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీ సీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు.

▸▸తరువాయి 2లో..



## లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

ప్రారంభించిన అమిత్ షా

**జమ్మూ,మే2(నినాదం):** క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్ధార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు.

▸▸వివరాలు 6లో..

## ఢిల్లీలో యువ జడ్జి ఆత్మహత్య



**న్యూఢిల్లీ, నినాదం:** దక్షిణ ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రాంతంలో జడ్జి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. జడ్జి అమన్ కుమార్ శర్మ (30) మృతదేహాన్ని ఆయన ఇంట్లో చూసిన బంధువు ఒకరు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో తమకు కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వారు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

▸▸తరువాయి 2లో..

## అమెరికాలోనూ ఇంధన ధరల మోత

సర్వీసులను నిలిపివేసిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సంస్థ




**న్యూయార్క్, నినాదం:** ఇంధన ధరల పెరుగుదలతో కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ సర్వీసులు అన్నిటినీ రద్దు చేశామని తాజాగా ప్రకటించింది.

▸▸వివరాలు 2లో..



## పాశ్చాత్య ప్రభావంతో మనదేశంలోనూ మార్పులు

- సమాజంలో కొరవడుతున్న ప్రశాంతత
- ఆధ్యాత్మిక చింతనతోనే పరిష్కారం
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**నెల్లూరు, నినాదం:** పాశ్చాత్య వ్యామోహం ఎక్కువై మనదేశంలో కూడా మార్పులు వస్తున్నాయని భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. రోజూ పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఎక్కడ చూసినా నేరాలు, ఘోరాలు, అశాంతి కనిపిస్తోందని అన్నారు. ఈ క్రమంలో మనిషి ఆధ్యాత్మిక జీవనం అలవర్చుకోవాలన్నారు. శనివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమడిలో ఆయన పర్యటించారు. శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర, విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేశ్ రెడ్డి, దీపావెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు.

▸▸తరువాయి 2లో..

## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

- ఇక విజయపంథాలోకి దూసుకుపోతాం..
- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత

**హైదరాబాద్,మే2(నినాదం):** తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు.



▸▸వివరాలు 2లో..

## బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే



- అక్కడ చెరువు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి
- ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ

**హైదరాబాద్,మే2(నినాదం):** హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసాయం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.

▸▸తరువాయి 2లో..

## మంత్రి ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్

- పౌరసరఫరాలో అత్యంత అవినీతి
- ఎంపి అర్వింద్ ఆరోపణలు



**హైదరాబాద్, నినాదం:** కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రానీ వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు.

▸▸తరువాయి 2లో..

## ఒంటరి జంటపై దుండగుల దాడి

యువతిపై సామూహిక అత్యాచారం

2

## నవదంపతుల ఆత్మహత్య

- కూకట్‌పల్లిలో విషాద ఘటన భర్త ఉరివేసుకోగా..
- భార్య పాయిజన్ తీసుకొన్నట్లు సమాచారం

## బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు

**న్యూఢిల్లీ, నినాదం:**

బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎలఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడి దారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండి పోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగదారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి యూజర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ ' అనే అంతర్జాతీయ వేదిక లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువతకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

## ఢిల్లీలో యువ జడ్జి ఆత్మహత్య

అసలేం జరిగిందో తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జడ్జి అమన్ కుమార్ శర్మ 2018లో సింబయాసిస్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2019 జూన్ 19న ఢిల్లీ జుడీషియల్ సర్వీసెస్‌లో చేరారు. తన కెరీర్‌లో ఆయన పలు కోర్టుల్లో వివిధ సివిల్, క్రిమినల్ కేసులను డీల్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఆయన డిస్ట్రిక్ట్□ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు.

## పాశ్చాత్య ప్రభావంతో మనదేశంలోనూ మార్పులు

ఆధ్యాత్మికత మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదని.. మొబైల్, టీవీలకు మాత్రమే సమయాన్ని కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దర్శించుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. సమాజం గతితప్పినప్పుడే వారిని సరైన మార్గంలో పెట్టేందుకు దివ్య స్వరూపులైన యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, పుట్టపర్తి సాయిబాబా, షిర్డీ సాయిబాబా లాంటి అవధూతలు భూమిపైకి వచ్చారని ప్రస్తావించారు. ఏదైనా పని చేయాలంటే మనసులో, కుటుంబంలో, గ్రామంలో, రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో కూడా శాంతి ఉండాలని సూచించారు. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. ఈ ఏడాది పదోతరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పాయ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో నాలుగుసార్లు కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతి పదవులు స్వీకరించానని ప్రస్తావించారు. తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌లతో... వారి వ్యాపారాల్లో తాను కలగజేసుకోనని, తన రాజకీయాల్లోకి వారు రావొద్దనే గౌరవ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలని వెంకయ్య నాయుడు సూచించారు.

## అమెరికాలోనూ ఇంధన ధరల మోత

**న్యూయార్క్, నినాదం:**

ఇంధన ధరల పెరుగుదలతో కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ సర్వీసులు అన్నిటినీ రద్దు చేశామని తాజగా ప్రకటించింది. త్వరలో అన్ని కార్యకలాపాలకు ఫుల్ స్టాప్ పెడతామని శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్నామని, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో మరోదారి లేక ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థ వెల్లడించింది. 'అన్ని స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సర్వీసులను రద్దు చేశాము. మా ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు వెళ్లవద్దని సూచిస్తున్నాము' అని ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ స్పిరిట్ ఏవియేషన్ హోల్డింగ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కస్టమర్ సర్వీస్ అందుబాటులో లేదని కూడా సంస్థ వెబ్‌సైట్‌లో నోటీసు కనిపించింది. అయితే, ఇప్పటికే టికెట్లు కొన్న వారికి డబ్బుల రీఫండ్ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని కూడా సంస్థ తెలిపింది. ఇక స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల నిలిపివేతపై కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ డేవ్ డేవిస్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న సంస్థ పునర్‌వ్యవస్థీకరణ ప్లాన్‌పై బాండ్ హోల్డర్స్‌తో మార్చి నెలలో అంగీకారం కుదిరిరిందన్నారు. అయితే, అకస్మాత్తుగా విమాన ఇంధన ధరలు పెరగడంతో పరిస్థితి చేయిదాటి పోయిందని అన్నారు. కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయడం మినహా మరో దారి లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. 'వ్యాపారాన్ని కొనసాగించేందుకు వందల మిలియన్ల నిధులు కావాలి. మా వద్ద అంత డబ్బు లేదు. నిధులను సమీకరించే అవకాశం కూడా లేదు. ఇది చాలా విచారకరమైన పరిణామం' అని అన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలయ్యాక అమెరికాలో విమాన ఇంధన ధరలు రెండింతలు అయ్యాయి. దీంతో, అనేక ఎయిర్‌లైన్స్ ఇప్పటికే ఈ ఏడాది లాభాల అంచనాలను తగ్గించుకున్నాయి. కార్యకలాపాల విస్తరణపై పెట్టుబడులకు కూడా బ్రేక్ చెప్పాయి. అప్పుల భారం, కార్యనిర్వహణ వైఫల్యాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ 2024 నవంబర్‌లోనే దివాలా తీసినట్టు ప్రకటించింది. ఆ తరువాత పునర్‌వ్యవస్థీకరణ ఎ `లాన్‌లో భాగంగా మళ్లీ కార్యకలాపాలను ప్రారంభించింది. కంపెనీని పూర్తిగా గట్టెక్కించేందుకు మరో ప్రణాళికపై కూడా చర్చలు జరుగుతున్నాయి. సంస్థను ఆదుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం ఒక ఎ లాన్‌ను ప్రతిపాదించింది. ఇదే తన చివరి ఆఫర్ అని కూడా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఈ క్రమంలోనే శనివారం స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.




# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

### సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి □డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎ లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆరఎంలు, డిపో మేనేజర్‌లు సవి క్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య వి□ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆరఎంలు, వివిధ విభాగాల హెచఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.



## ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్



శనివారం ఎంపీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సపై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్టులనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగు తోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/`1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా □డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

## ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనం

**ఆర్యవైశ్య మహాసభ అట్టర్ ఫ్లాప్**

**తెలంగాణ నేతల బహిష్కరణ**

**రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యామ్ సుందర్**

హైదరాబాద్ : తెలంగాణ ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనమే కొనసాగుతోందని, తెలంగాణ వైశ్యనేతలు దూరంగా ఉండటమే ఇందుకు కారణమని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యాంసుందర్ ఆరోపించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడిగా అమరవాది లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేయగా, జరిగిన సభ ఆశించిన స్థాయిలో సాగకపోగా, అట్టర్ ఎలాప్ అయిందని ఆయన అన్నారు. కేవలం ఆంధ్ర నాయకులకే పరిమితమైన ఈ సభకు తెలంగాణ నేతలెవరూ హాజరు కాలేదని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. అమరవాది ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తెలంగాణ ఆర్యవైశ్య నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో బహిష్కరించడం ద్వారా అమరవాది వర్గానికి గట్టి బుద్ధి చెప్పారని శ్యామ్ విమర్శించారు.

## రీపోలింగ్ లోనూ భారీగా ఓటింగ్

**బారులు తీరి ఓటేసిన జనం, 90శాతం పోలింగ్ నమోదు**

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ సౌత్ 24 పరగణాల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 15 బూత్‌లలో శనివారంనాడు రీపోలింగ్ ముగిసింది. మగ్రహాట్ పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గం లోని 11 పోలింగ్ స్టేషన్లు, డైమండ్ హార్బర్‌లోని 4 పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6 గంటలతో ముగిసింది. 90 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికార వర్గాలు తెలిపాయి.

కాగా, ఉదయం 11 గంటల వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఆ తర్వాత సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకున్నట్టు బీజేపీ కార్యకర్తలు ఆరోపించగా, ఓటింగ్ ప్రక్రియకు బీజేపీ కార్యకర్తలు అడ్డుపడుతున్నట్టు టీఎంసీ కార్యకర్తలు ఆరోపించారు. దీనికితోడు, ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీగా బలగాలను మోహరించినా టీఎంసీ గూండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్టాం□`రగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను ఈసీ సీరియస్‌గా తీసుకుందని, స్థానికులను బెదిరించిన టీఎంసీ గూండాలపై ఎఫఐఆర్ నమోదు చేయాలని ఆదేశించిందని అధికారులు చెప్పారు.

## ఓట్ల లెక్కింపులో ఇసి మరో కీలక నిర్ణయం

**అదనపు పరిశీలకులను నియిమస్తూ ఆదేశాలు**

ఓట్ల లెక్కింపు తేదీ సవిÖపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల సంఘం అదనపు పరిశీలకులను మోహరించింది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న నియోజకవర్గాల్లో మొత్తం 165 మంది ఎన్నికల, 77 మంది పోలీసులను పరిశీలకులుగా నియమించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సురక్షితంగా, పారదర్శకంగా సాగేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతల ఏర్పాట్లను పోలీసు పరిశీలకులు పర్యవేక్షిస్తారని తెలిపింది. ఈసీఐనెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు పేర్కొంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికి 86 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మరోవైపు ఓట్ల లెక్కింపు తర్వాత తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇదే జిల్లాలోని ఫల్టాలో వందలాది మంది నిరసన చేపట్టారు. ఈ ప్రాంతంలోని టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణ హాని ఉందన్నారు.

## ఒంటరి జంటపై దుండగుల దాడి

**యువతిపై సామూహిక అత్యాచారం**

మహబూబ్‌నగర్, నినాదం: జిల్లాలోని హన్వాడలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒంటరిగా ఉన్న ఓ ప్రేమ జంటపై దుండగులు దారుణానికి ఒడిగట్టారు. ప్రియుడిని బెదిరించి డబ్బులు వసూలు చేయడమే కాకుండా, బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. నగర శివారులోని ఓ మైదాన ప్రాంతానికి ప్రేమ జంట వెళ్లింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన దుండగులు వారిని అడ్డుకున్నారు. ప్రియుడిని భయపెట్టి ఆయన వద్దనున్న డబ్బును బలవంతంగా లాక్కున్నారు. వెంటనే అప్రమత్తమైన ప్రియుడు.. పోలీస్ సహాయం కోసం డయల్ 100కు కాల్ చేశాడు. అయితే.. పోలీసులు వచ్చేలోపే దుండగులు బాలికపై దారుణంగా సామÖహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను రక్షించి ప్రాథమిక విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

## నవదంపతుల ఆత్మహత్య

హైదరాబాద్ : హైదరాబాద్ కూకట్ పల్లిలో విషాదం చోటుచేసుకుంది. కార్తీక్(28), మంజుల(27) అనే నవదంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కార్తీక్ ఉరివేసుకోగా భార్య మంజుల పాయిజన్ తీసుకొన్నట్లు సమాచారం. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మార్చి 8న పెళ్లి జరగగా రెండు నెలలైనా గడవకముందే ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నవదంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కార్తీక్ మార్కెటింగ్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంజుల హౌస్ వైఫ్. మృతుడు సోదరుడు మాట్లాడుతూ.. ఇద్దరు సూసైడ్ చేసుకోవడం మమ్మల్ని కలిచి వేసింది.. మేము షాక్ లో ఉన్నామని తెలిపారు. కార్తీక్ మంజుల సూసైడ్ ఎందుకు చేసుకున్నారో తెలియదు. కార్తీక్ ఎంత ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. తనకు అరగంట క్రితం పోలీసు నుండి మా సోదరుడు సూసైడ్ చేసుకున్నాడని కాల్స్ వచ్చినట్లు తెలిపాడు. దీంతో ఇంటికి చేరుకుని వెంటనే □ప్రైవేట్ హాస్పిటల్ షిఫ్ట్ చేశాం.. బెడ్ రూంలో కార్తిక్ హ్యాంగ్ చేసుకున్నాడు.. మంజుల పాయిజన్ తీసుకుందని తెలిపాడు. కార్తీక్ మంజుల ఇద్దరు మంచిగా ఉండేవారన్నారు. నిన్న సాయంత్రం వారి ఇద్దరితో మాట్లాడాను వారు మంచిగా మాట్లాడారని చెప్పారు. ఎందుకు సుసైడ్ నిర్ణయం తీసుకున్నారో మాకు తెలియదన్నారు. కారణం ఏంటో అసలు తెలియదు.. పోలీసులు ఇన్వెస్టిగేషన్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కూకట్‌పల్లి సీఐ శోభన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందింది.. □ప్రైవేట్ హాస్పిటల్ వారు మాకు కాల్ చేసి ఇద్దరు సూసైడ్ చేసుకున్న కేస్ వచ్చిందని తెలిపారు. దీంతో మా టీమ్ తో ఆసుపత్రికి చేరుకున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు మృతి చెందారు.. కార్తీక్ బెడ్ రూమ్ లో హ్యాంగ్ చేసుకున్నాడు మంజుల పాయిజన్ తీసుకున్నట్లు ఉందని తెలిపారు. మంజుల తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు ఎందుకు సూసైడ్ చేసుకున్నారో కారణాలు తెలియరాలేదని అన్నారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్తీక్ ఇంట్లో క్లూస్ టీం తో ఆధారాల సేకరిస్తున్నాం.. సూసైడ్ నోట్ లభించలేదని సీఐ శోభన్ తెలిపారు.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న హావి□ల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆరఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది □ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హావి□ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18`25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25`45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆరఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.



# రైతు వారోత్సవాలు సమర్థవంతంగా నిర్వహించాలి

## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్




**నాగర్ కర్నూల్ మే 2 ( నినాదం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా కొనసాగించేందుకు జిల్లాలో అన్ని కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ, హార్టికల్చర్, తాగునీటి పారుదల శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రైతు వారోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 4 నుంచి 9 వరకు వ్యవసాయ ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి,మే 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రైతు వారోత్సవాలను జిల్లావ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు వారోత్సవాలు కేవలం కార్యక్రమాలుగా కాకుండా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించేలా ఉండాలని, రైతు వేదికల్లో సహజ వ్యవసాయం, నానో యూరియా వినియోగం, మట్టి పరీక్షలు, వివిధ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలైన ఉద్యానవన, పశుసంవర్ధక, నీటి వనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాల వివరాలు సమగ్రంగా అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రైతుల భాగస్వామ్యాన్ని పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండలంలో రైతు సదస్సులు, ప్రదర్శనలు, శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని, రైతు వారోత్సవాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయం గురించి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల బ్యూరో మే 2 (నినాదం)**

ఈ నెల మే 3వ తేదీ (ఆదివారం)నిర్వహించనున్న నీట్ యూజీ- 2026 పరీక్షకు నిషేధిత వస్తువులను అనుమతించడం జరగదని సంబంధించి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 04 పరీక్షా కేంద్రాల్లో సుమారు 936 మంది అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో, పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యార్థులు ఎన్.టి.ఎ నిబంధనల మేరకు నిషేధిత వస్తువుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, బ్లూటూత్, ఇయర్ ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ఎలాంటి స్టేషనరీ వస్తువులను (పెన్ డ్రైవ్‌లు, కాలిక్యులేటర్లు, ప్యాడ్‌లు) అనుమతించబోమని స్పష్టం చేశారు. అలాగే వాలెట్లు, హ్యాండ్ బ్యాగులు, బెల్టులు, టోపీలు, చేతి గడియారాలు, లోహపు ఆభరణాలను అభ్యర్థులు ధరించకూడదని సూచించారు. కేవలం పారదర్శకమైన నీటి సీసాను మాత్రమే అనుమతిస్తామని, ఆహార పదార్థాలకు అనుమతి లేదని సూచించారు. అభ్యర్థులు తమ వెంట తెచ్చుకునే వస్తువుల పట్ల కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి బాధ్యత తీసుకోరని, కావున కేంద్రాల వద్ద నిషేధించిన వస్తువులను ఇంటి వద్దే వదిలి రావాలని సూచించారు. ఎవరైనా అభ్యర్థి నిబంధనలకు విరుద్ధంగా వస్తువులతో పట్టుబడితే, వారిని పరీక్షకు అనర్హులుగా ప్రకటించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# నకిలీ ధ్రువ పత్రాలు తయారీ గుట్టురట్టు చేసిన రెవెన్యూ అధికారులు






**గద్వాల ప్రతినిధి మే 2 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసిన లక్ష్మీ నరసింహ ప్రింటింగ్ ప్రెస్ పై రెవిన్యూ అధికారులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. శనివారం మండల తహసిల్దార్ ఎన్. జ్యోతి ఆదేశాల మేరకు ఆర్. ఐ రజినీకాంత్ రెడ్డి మరియు జీపీవోలు లక్ష్మీనరసింహ ప్రింటింగ్ ప్రెస్ పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వివిధ శాఖలకు సంబంధించిన గవర్నమెంట్ డాక్టర్స్, సర్పంచులు, హెడ్మాస్టర్లు, మ్యారేజ్ సర్టిఫికెట్స్ ఆధార్ కార్డులు, ఎస్ఎస్సి మెమోలు, బోనఫైడ్లు, తదితర నకిలీ ధ్రువ పత్రాలకు సంబంధించిన ముద్రలు రాయలసీమలోని వివిధ జిల్లాలకు సంబంధించిన ముద్రలు, గట్టు మండలం కు ముద్రలు పెద్ద ఎత్తున సుమారు 18 దొరికాయి. అలాగే కంప్యూటర్ ని ఓపెన్ చేయగా సుమారు 150 పైగా వివిధ పత్రాలు నకిలీవి తయారు చేసినట్టు గుర్తించారు. అనంతరం సిపిఓ, కంప్యూటర్, ముద్రలు, తదితర వాటిని స్వాధీనం చేసుకొని దర్యాప్తు నిమిత్తం పోలీస్ డిపార్ట్మెంట్కు అప్పచెప్పినట్లు తెలిపారు. ఈ విషయమై తాసిల్దార్ మాట్లాడుతూ మాకు వచ్చిన నమ్మదగిన సమాచారం, కంప్లైంట్ మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కుసుమరుపు ఏంటంటే గట్టు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ తమ్ముడు వీరేష్ ఇవన్నీ చేస్తున్నాడు నేను కాదంటూ ట్విస్ట్ ఇచ్చాడు.ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ తో పాటు జిపిఓ లు జ్యోతి, రహమతుల్లా, బాలు ఉన్నారు.




## మూడు రోజుల శిక్షణను పూర్తి చేసుకున్న జనగణన సూపర్వైజర్స్ ఎనిమిరేటర్స్

**మధిర, మే 2 (నినాదం):**

జనాభా గణన 2027 దేశ ప్రణాళిక మరియు అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది... మధిర మున్సిపాలిటీ పరిధిలోని జనాభా గణన-2027 లో భాగంగా సూపర్వైజర్, ఎనిమి రేటర్స్ కి గత మూడు రోజుల నుంచి స్థానిక గర్ల్స్ హైస్కూల్లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా కమిషనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క సూపర్వైజర్, ఎనిమినేటర్ అంకిత భావంతో, అత్యంత శ్రద్ధతో మీ విధులను నెరవేర్చవలసిన బాధ్యత మీపై ఉందని, దీనివల్ల దేశ ప్రణాళిక మరియు అభివృద్ధికి అవసరమైన సమాచారం అందుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మే 11 నుండి జూన్ 9 వరకు 30 రోజుల పాటు ఉండునని మరియు ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎనిమిరేషన్ మే 10 వరకు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి సూపర్వైజర్, ఎనిమినేటర్ విధుల గురించి వివరంగా తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన కొరకు సూచనల ను, ఎనిమిరేటర్లు, సూపర్వైజర్ల పాత్రలు, బాధ్యతలు, న్యాయపరమైన నిబంధనలు, హక్కులు, భవనము గణన, గృహములకు నెంబర్లు ఇచ్చుట మరియు అమరిక పటమును తయారు చేయుట, ఇంట్లో జాబితా మరియు ఇండ్లకు గణన ప్రశ్నలు పూరించుటకు సూచనలు, స్వీయ గణన గురించి పూర్తి అవగాహనను జిల్లా ఫీల్డ్ ట్రైనర్స్ బి. జ్ఞానేశ్వర చారి, జల్లా విశ్వనాథం కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటును సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి అందించారు మరియు ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో 31 మంది శిక్షకులు పాల్గొన్నారు అని తర్వాత మూడు రోజులపాటు మరియొక 31 మందికి శిక్షణ ఇక్కడే ఉండునని తెలిపారు. ఈ శిక్షణలో యాప్ ల గురించి పూర్తి అవగాహనను, యాప్ లా ఇన్స్టాలేషన్ గురించి ఫీల్డ్ టెక్నీషియన్ కిరణ్ వివరించారు. చివరగా మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ సూపర్వైజర్, ఎనిమిరేటర్స్ సెన్సెస్ కు సంబంధించిన సామాగ్రి, ఆర్డర్ కాపీలు, ఐడెంటి కార్డులను అందించడం జరిగింది.

## ఖమ్మంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, మే 2 (నినాదం ):**



ఖమ్మం నగరంలో జరిగిన వివిధ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. శనివారం పుట్టకోట గ్రామంలో ఇటీవల కాలంలో మన్నించిన బి రెడ్డి విజయభాస్కర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వివిధ ప్రాంతంలో జరిగిన శుభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పువ్వాడ వెంట మాజీ సుడ చైర్మన్ బచ్చో విజయ్ కుమార్, నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి తదితరులు పాల్గొన్నారు.



## దుర్గంధం వెదజల్లుతున్న రాజీవ్ గాంధీ నగర్

**పడకేసిన పారిశుధ్యం పనులు.. జ్వరాలు బారిన పడుతున్న జనం**
**పట్టించుకోని పంచాయతీ అధికారులు**

**మణుగూరు మే 2 (నినాదం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రాజీవ్ గాంధీ నగర్ లో పారిశుధ్యం పనులు పడకేసినట్లు, దీంతో రాజీవ్ గాంధీ నగరంతా దుర్గంధంతో ఎదజల్లుతుందని రేణుక అక్షర మహిళ మండలి తీవ్ర స్థాయిలో ఆరోపించింది. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..... ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం వెదజల్లుతుంది, డ్రైనేజీలో పందులు, కుక్కలతో దుర్గంధం నిత్యం వెదజల్లుతుందని వారు ఆరోపించారు. నెలలు తరబడి రాజీవ్ గాంధీ నగర్ లో కాలువల డ్రైనేజీలు అపరిశుభ్రంగా మారిపోయాయి. ఎక్కడ చూసినచెత్తాచెదారం పేరుకుపోయింది ,దీంతో దోమలు,ఈగలు, భారీగా పెరిగిపోయి పిల్లలు వృద్ధులు అనేకమంది జ్వరాలు బారిన పడుతున్న పంచాయతీ సిబ్బంది మటుకు స్పందించడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందించిన పంచాయతీ సెక్రెటరీ పై గ్రామస్తులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లుగా వారి పేర్కొన్నారు. ప్రజలు అనారోగ్యంతో బాధలు పడుతున్న పంచాయతీ కార్యదర్శి అధికారులు ఏమాత్రం మొద్దు నిద్రలో ఉంటున్నారు, అంటూ వారు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. రాజీవ్ గాంధీ నగర్ లో కాలవలు డ్రైనేజీలు మురికి కూపాలుగా మారిపోయే చెత్తాచెదారం పంచాయతీ సిబ్బంది బయటకు తీయడం లేదని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఇదే పరిస్థితి వర్షాకాలం వరకు కొనసాగితే మరణాలు కూడా సంభవించే అవకాశం ఉన్నట్లు వారు ఆరోపించారు. పంచాయతీ సెక్రెటరీ జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని బాధ్యులపై కఠిన చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ సెక్రెటరీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షరమైన మహిళ మండల అధ్యక్షురాలు పూనెం సరోజ, ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డి బోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం శైలజ, బాడిస పార్వతి, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రైతులకు ప్రజాపాలన ప్రభుత్వం అండగా ఉంటుంది**
**ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి చైర్మన్ యాట గీత వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి**

**కల్వకుర్తి మే 2 (నినాదం)**



కడ్తాల్ రైతులకు ప్రజాపాలన ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పౌరసరఫరాల శాఖ సహకారంతో మండల ఐకెపి ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, ఏఎంసి చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ. ప్రజాపాలన ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ప్రభుత్వ సన్న వడ్లకు అందిస్తున్న రూ.500 బోనస్‌ను పొందాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కుమారి, ఏపీఎం రాములు, ఏఎంసీ డైరెక్టర్లు, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉప సర్పంచ్ ఈ రెడ్డి యాదగిరి రెడ్డి, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, వార్డు సభ్యులు భాను కిరణ్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు చందోజి, జహంగీర్ బాబా, జాంగిర్ అలీ, వెంకట్ రెడ్డి, దారెడ్డి అంజన్ రెడ్డి, రాములు , బిక్షపతి, మహిళా సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన నిషికా పాత్రుడు

**మధిర, మే 2 (నినాదం):**



మధిర కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన నిషికా పాత్రుడు. శనివారం మధిర కోర్టులో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన నిషి కా పాత్రుడు. మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల నుండి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మధిర బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆమెకు హృదయపూర్వక స్వాగతం పలికి అభినందనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావాలి రామరాజు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, ఏ పి పి జన్ను భద్రయ్య, కట్టా పూర్ణచంద్ర రావు, కావూరి రమేష్, పల్లబోతుల కృష్ణారావు, కోట జ్ఞానేశ్, టీ. వెంకట్రావు, రమేష్, సతీష్, విజయకుమార్, పుట్టా శ్రీనివాస్, తూములూరి సంధ్య, వంశీ తేజ, కోర్టు సూపరిం టెన్ డేస్, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు దీప్తి వేముల, మరియు నిషికా పాత్రుడు మాట్లాడుతూ మధిర కోర్టులో న్యాయం వేగంగా, పారదర్శకంగా, అందించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. న్యాయవాదులు మరియు కోర్టు సిబ్బంది సహకారంతో న్యాయవ్యవస్థ పై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అందరి సహకారం కోరుతూ తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని చెప్పారు.

## మోటమర్రి స్మశాన వాటికలో నీటి సమస్యకు పరిష్కారం

**మధిర, మే 2 (నినాదం):**



ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గం, బోనకల్లు మండలం మోటమర్రి గ్రామంలో స్మశాన వాటిక నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. ఎన్నో సంవత్సరాలుగా సర్పంచులు మారినా, స్మశాన వాటిక అభివృద్ధి పట్ల ఎవరు ముందుకు రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మశాన వాటికలో కనీస సదుపాయాలైన షెడ్లు, చేతిపంపు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోయింది. అయితే తాజాగా బాధ్యతలు చేపట్టిన గ్రామ సర్పంచ్ మర్రి సురేష్, ఉపసర్పంచ్ కిరణ్ కుమార్ మరియు పాలకవర్గ సభ్యులు ముందడుగు వేసి స్మశాన వాటికలో చేతి పంపు ను ఏర్పాటు చేశారు. ఈ చేతిపంపును శనివారం సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న అవసరం నెరవేరిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో స్మశాన వాటికను మరింత అభివృద్ధి చేసి షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సర్పంచి మరియు పాలకవర్గ సభ్యులు తెలిపారు.





# ప్రజా పాలన అంటే కాంగ్రెస్ పాలన

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి మే 2 (నినాదం)**

కల్వకుర్తి నియోజకవర్గంలోని సి.కే.ఆర్ గార్డెన్‌లో ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం అయింది.ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల గౌరవ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, పత్రికా మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విస్తృతంగా హాజరయ్యారు. సమావేశంలో రైతు భరోసా, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి ( బ్యాంక్ లింకేజీ వడ్డీ లేని రుణాలు ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు, అలాగే జిల్లా మరియు మండల సాధారణ నిధులతో చేపట్టిన పనులపై సమగ్రంగాచర్చించబడింది.కార్యక్రమంలో జెడ్పి సీఈఓ కృష్ణారెడ్డి , కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి కల్వకుర్తి డిఎస్పి సైరెడ్డి వెంకటరెడ్డి, మున్సిపాలిటీ చైర్ పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షా నవాజ్ ఖాన్, జిల్లా ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు గుమ్మ కొండ రాములు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, బట్టుకిషన్ రెడ్డి, బెక్కార బాల్ రెడ్డి, జగన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.



## టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆఏటి పురుషోత్తంకు సన్మానం

**నిజామాబాద్ ప్రతినిధి, మే 2 (నినాదం)**

టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఆఏటి పురుషోత్తం ఎన్నికైన సందర్భంగా బిసి టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ నాయకులు పురుషోత్తంకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ పురుషోత్తం సేవలు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో టీఎన్జీవో జిల్లా శాఖ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిసిటియు , జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కంచరి రవికుమార్, వేణు, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ భవనం పైనుంచి దూకి యువతి ఆత్మహత్యయత్నం

**ఆర్మూర్, మే 2 (నినాదం):**



పోలీస్ స్టేషన్ భవనం పైనుంచి దూకి ఓ యువతి ఆత్మహత్య కు ప్రయత్నించిన సంఘటన చిలికి చిలికి గాలివానగా మారి, బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో చర్చనీయంగా మారి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన ముప్ కాల్ పోలీస్ స్టేషన్ భవనం పైనుంచి ఒక యువతి(20) ఆత్మయత్నం చేయగా, అట్టి యువతిని చికిత్స నిమిత్తం హుటాహుటిన జిల్లా కేంద్రంలో గల జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాల్కొండ కు చెందిన ఒక యువకుడు వివాహేతుడైనప్పటికీ తనను ప్రేమ పేరుతో మోసం చేశాడని, ఓ యువతి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అయితే తన జీవితం ఎటు కాకుండా నాశనం అయిందని, మనస్థాపం చెందిన యువతి స్థానికంగా ఉన్న మరో పోలీస్ స్టేషన్ ముప్కల్ మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్ భవనం పైకి ఎక్కి, భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన జరగడం, అక్కడే ఉన్న యువతి బంధువులు, పోలీసులు ఒక్కసారిగా షాక్కు గురయ్యారు. వెంటనే యువతిని జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యువతి ఆత్మహత్యకు కారకులైన వ్యక్తి పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సమాచారం.



## విగ్రహా ప్రతిష్ట ఉత్సవాల్లో పాల్గొన్న కౌన్సిలర్ పాపి శెట్టి రాము

**కల్వకుర్తి మే 2 (నినాదం)**

వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కంఠ మహేశ్వర స్వామి, శివుడు, పోచమ్మ మైసమ్మ విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సందర్భంగా విగ్రహాల ఊరేగింపుగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత పాపిశెట్టి రాము ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి ఆలయ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. భక్తులు హోమాలు చేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు వంశీకృష్ణ శర్మ, రాఘవశర్మ, కృష్ణతేజ శర్మ, సూరజ్ శర్మ, భరత్ కుమార్ శర్మ, చంద్రకాంత్ శర్మ, నాయకులు శ్రీను నాయక్, సైదులు గౌడ్ ఉస్తవ కమిటీ సభ్యులు ఉన్నారు.



## పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం

**అభినందించిన ఆర్ యు పి టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్**

**నాగర్ కర్నూల్ మే 2 ( నినాదం)**

రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాలలో నాగర్ కర్నూలు జిల్లా ద్వితీయ స్థానాన్ని సాధించినందుకు అభినందిస్తూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్ మర్యాదపూర్వకంగా జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గిరిజారమణ జిల్లా బాద్యులు గౌరోజు వెంకటేశ్వర్లు శైలజ రఫీ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమమే లక్ష్యం.. అర్హు లందరికీ పథకాల అమలు

**నియోజకవర్గ స్థాయి సమావేశంలో కలెక్టర్ చిత్ర మిశ్రా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కీలక సూచనలు**



**కరీంనగర్, మే 2(నినాదం) :** ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ చిత్ర మిశ్రా తెలిపారు. శాఖల వారీగా సమస్యలను పరిష్కరించి, అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గంగాధర మండలం పాపాయపల్లిలో నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీ, శిశు సంక్షేమం, స్థానిక సంస్థలు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రజావాణి ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తున్నామని చెప్పారు. అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు రైతు బీమా, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి, మహాలక్ష్మి, చేయూత పెన్షన్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, అంగన్వాడీ సేవలు, ఆయిల్ ఫామ్ సాగు వంటి పథకాల అమలు వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, పార్టీ భేదాలు లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నామని, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు సన్న రకాల వరికి బోనస్ అందిస్తూ, రుణమాఫీ ద్వారా ఆర్థిక భారం తగ్గించామని పేర్కొన్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి అయితే చొప్పదండి, వేములవాడ ప్రాంతాలకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. ప్రాజెక్టు కోసం భూసేకరణకు ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, త్వరలో మరిన్ని నిధులు విడుదల అవుతాయని చెప్పారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తూకాల్లో అక్రమాలు జరగకుండా కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. సర్పంచులు ఎన్నికల తర్వాత గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని, ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కలెక్టర్ చిత్రా మిశ్రా, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

# ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**పదిలో వంద శాతం ఫలితాలే లక్ష్యం**

**విద్యా శాఖపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష**



**గద్వాల బ్యూరో మే 2 (నినాదం) :** మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు త్వరలో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలపై శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విద్యాశాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాలు, విద్యార్థుల నమోదు, పాఠశాల మౌలిక వసతులపై కీలక సూచనలు జారీ చేశారు. ప్రతి పాఠశాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితాను సబ్జెక్టు వారీగా సిద్ధం చేసి, వారికి 15--20 రోజుల పాటు ప్రత్యేక రీమిడియల్ తరగతుల ద్వారా సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. వారం రోజుల్లో పరీక్ష ఫీజులు చెల్లింపులు పూర్తి చేయించి, జూన్‌లో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల కోసం కేజీబీవీ లలో భోజన వసతి సౌకర్యాలతో పాటు, బాలురకు ప్రత్యేక పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఉన్నత విద్యలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్, డిప్లొమా తదితర కోర్సులపై అవగాహన కల్పించి, విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారి అడ్మిషన్ల వివరాలను రోజువారీగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న "ఎడ్యుకేషన్ వీక్" కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ వారోత్సవాల్లో పాఠశాలలలో మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రారంభం, రీమిడియల్ క్యాంపులు, సర్పంచ్‌లతో వర్క్‌షాప్, బడిబాట ద్వారా నమోదు పెంపు, లైబ్రరీ దినోత్సవం, ఆర్ట్-క్రాఫ్ట్ కార్యక్రమాలు, బాలభవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మరుగుదొడ్లు, మరమ్మతులు, విద్యుత్ సదుపాయం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో జరుగుతున్న పనులను పీపీటీ రూపంలో నమోదు చేసి, ఫోటోలు, నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు, ఎంఈఓలు, జీ హెచ్‌ఎంలు సమన్వయంతో పని చేయాలని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మరియు నమోదు పెంపు లక్ష్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ంఈ సమావేశంలో డీఈవో విజయలక్ష్మి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో అగ్నికి ఆహుతైన ఆటో స్టోర్


**ప్రమాద స్థలాన్ని సందర్శించి, కారణాలు అడిగి తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**మెట్‌పల్లి, మే2 (నినాదం):** మెట్ పల్లి పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో గల ఆటో స్టోర్ లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించి ఆటో స్టోర్ అగ్నికి ఆహుతైంది. సమాచారాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వెంటనే ప్రమాద స్థలాన్ని సందర్శించి అగ్ని ప్రమాదం సంభవించడా నికి గల కారణాలు సంధిత అధికారులను అడిగి తెలుసు కొన్నారు. శ్రీనాథ్ ఆటో స్టోర్ లోని ఆయిల్ టైర్లు ప్లాస్టిక్ వస్తువులు అగ్ని ప్రమాదంలో కాలి బూడిద కాగా స్థానికశీగా ఆందోళనకు గురిచేసింది. సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జువ్వాడి కృష్ణారావు సూచించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. బాధిత వ్యాపారిని పరామర్శిస్తూ ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం తరుపున సహాయాన్ని అందించాలన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా వ్యాపార సంస్థల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. నేటి ప్రమాదంలో సుమారు రూ. 40 లక్షల వరకు నష్టం సంభవించినట్లు ఆటో స్టోర్ యజమాని తెలినట్లు జువ్వాడి కృష్ణారావు వెల్లడించారు. ఘటన తో వ్యాపార వర్గాల్లో ఆందోళనకు గురి కాకుండా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు తక్షణమే స్పందించినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. బాధితుల కు త్వరితగతిన సహాయం అందించాలని నష్టపరిహారం కల్పించాలని స్థానికులు కోరారు. జువ్వాడి కృష్ణారావు వెంట మెట్ పల్లి సీఐ సురేష్ బాబు, పోలీస్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అగ్ని మాపక సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించాలి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**





**కుత్బుల్లాపూర్, మే 2 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) అధికారులు, సిబ్బంది ప్రయాణికుల పట్ల సానుకూల వైఖరిని అవలంబించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తో కలిసి ఉన్నతాధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు లేవనెత్తిన అంశాలపై మంత్రి ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టీసీలో పని చేసే డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కింది స్థాయి సిబ్బందిపై అధికారులు వేధింపు ధోరణితో కాకుండా స్నేహపూర్వక వాతావరణం లో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించకుండా, ఆప్యాయతతో, స్నేహపూర్వక వాతావరణంలో వారి ద్వారా పనులు చేయించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సిబ్బంది సమస్యలను నేరుగా వినేందుకు ప్రతి నెల రెండో మంగళవారం అన్ని డిపోలలో ఫిర్యాదుల పరిష్కార సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, మే 17వ తేదీలోగా అన్ని డిపోలు, బస్ స్టేషన్లలో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచాలని డిపో మేనేజర్లను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, పచ్చదనం, పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. టికెటింగ్ విషయంలో తలెత్తే సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, సిబ్బందితో వాగ్వాదాలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. డిసెంబర్ 9, 2023న ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం విజయవంతంగా కొనసాగుతోందని గుర్తు చేస్తూ, ప్రజా ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని డిపో మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు.

**జూన్ నెలాఖరులోగా పెండింగ్ అంశాల పరిష్కారం. ఎండీ వై. నాగిరెడ్డి**

ఈ సమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ జూన్ నెలాఖరులోగా బస్టాండులలోని కమర్షియల్ షాపులకు సంబంధించిన పెండింగ్ అంశాలను, ఇతర పరిపాలనాపరమైన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో సంస్థను మరింత లాభదాయకంగా, సేవా దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సిహెచ్. వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాలోమన్, ఎఫ్‌ఏ విజయపుష్ప, సిటీఎం శ్రీదేవితో పాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, రీజినల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఫలాలు ప్రజలకు చేరాలన్నది ప్రభుత్వ లక్ష్యం

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**





**వికారాబాద్, మే 2(నినాదం):** ప్రభుత్వం అంధించే ఫలాలు ప్రజలకు చేరాల్లన్నది ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం వికారాబాద్ నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ప్రారంభించిందన్నారు. సమస్యల పరిష్కారంతో పాటుగా మన ప్రభుత్వం వచ్చాక ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటుగా అదే సమయంలో ప్రజల అవసరాలను స్థానికంగా తెలుసుకుని త్వరితంగా పరిష్కరించడం ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లక్ష్యంమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక గత రెండున్నర సంవత్సరాలలో పనులు చేయలేదని ప్రతిపక్షాల నాయకులు విమర్శలు చేస్తున్నారని గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి పని చేసి పది రూపాయల ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం వంద రూపాయల పనిచేసి రూపాయ ప్రచారం చేసుకోవడం లేదని అన్నారు. ఉదాహరణకు గత ప్రభుత్వం పదేళ్ళలో మన వికారాబాద్ నియోజకవర్గంలో కొత్తగా ఒక్క రోడ్డు వేయలేదని, ఉన్నవి రిపేరు చేయలేదని అన్నారు. గత రెండున్నర సంవత్సరాలలో 600 కోట్లతో రోడ్లు నిర్మాణం చేయించిన్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో 50 లక్షలతో సిసి రోడ్లు వేయించమని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తోందని గత ప్రభుత్వ పాలకులు ప్రచారం చేసుకున్నారని చమత్కరించారు. పదేళ్ళ పాలనలో ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని రాష్ట్రాన్ని మాత్రం వందేళ్లు వెనుకకు నెట్టారాని అన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. నాటి ముఖ్యమంత్రి చేసిన ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులు మాత్రమే కనిపిస్తున్నాయని, చేసిన పనులు మాత్రం ఎక్కడా కనబడటం లేదని ఆరోపించారు. అప్పులతో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందని ప్రతి నెలకు 6,500 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఉన్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్ధుడని ఈ అప్పులను తీర్చుతూ మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తున్నాడని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మీ పథకంలో అక్కా చెల్లెల్లకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలెండర్ ఇస్తున్నామని గృహజ్యోతి పథకంలో పేదల ఇళ్ళకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పది లక్షలకు పెంచామని చెప్పుకొచ్చారు. రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ జరిగిందని , సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని పదేళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని పేదలందరికి ఇందిరమ్మ ఇళు వస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇళ్ళు అంటూ పదేళ్ల పాటు పేదలను మోసం చేశారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రవేటు రంగంలో 15 లక్షల ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్ల పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని అన్నారు. ఈ ఏడాది నుండి రాష్ట్రంలోని కుటుంబాలన్నింటికి భరోసా ఉండాలనే ఉద్యేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బడికి వెళ్ళే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి, ఆకలితో ఉండొద్దనే ఉద్యేశంతో ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉదయం పూట అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అదేవిదంగా ఇంటర్ మీడియట్ విద్యార్థులకు కూడా మద్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతిని తీసుకొచ్చాం, తొంబై ఏళ్ళ తరువాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను రీసర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు లేకపోతే మన ప్రభుత్వంలో తులం బంగారం వచ్చేదని అక్కా చెల్లెల్లకు నెలకు 2,500 రూపాయలు వచ్చేవని అన్నారు. పెన్షన్లు కూడా పెరిగేవని త్వరలోనే అన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేవలం రెండున్నర సంవత్సరాలలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు. ప్రజలు మంచి ఆలోచన పరులని , ఎవరు ప్రచారం చేసుకుంటారానేది ఎవరు పనులు చేస్తారనేది తెలుసుకుని ఆదరిస్తారని చెప్పారు. వచ్చేసారి కూడా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి శ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇది పదేళ్ళు ఉండే ప్రభుత్వమని జ్యోష్యం చెప్పారు. ఎన్నికల ప్రచార సమయంలో మేము ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామాల్లో, కాలనీలలోని ప్రజలకు తెలియజేయాలని గ్రామ సర్పంచ్ లకు, మున్సిపల్ కౌన్సిలర్లలకు సూచించారు. మనం చేస్తున్న పనుల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ప్రజ పాలన ప్రగతి ప్రణాళిక ఇందుకు సరైన వేదికగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అందరూ ప్రభుత్వ సమావేశాలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో 200 కోట్లతో 20 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మెడికల్ కాలేజీ నిర్మాణం వేగంగా జరుగుతున్నదన్నారు. ప్రతి మండలంలో ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే మర్పల్లి మండల కేంద్రానికి ఒక పబ్లిక్ స్కూల్ మంజూరు అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్, అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జడ్పి సీఈ వో సుదీర్, మున్సిపల్ ఛైర్పర్సన్ అనన్య, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఏ ఎం సి చైర్మన్లు చాపల శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు, కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల తండా నుండి ర్యాంక్ సాధించడం అభినందనీయం

**డిప్యూటీ కమిషనర్ గోవర్ధన్**




**మిర్యాలగూడ మే 2 (నినాదం) :** ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి పేరు ప్రఖ్యాతలు సాధించిన లావుడి కావ్యను శనివారం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ గోవర్ధన్, యాదగిరిగుట్ట తాసిల్దార్ గణేష్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ లు మాట్లాడుతూ మారుమూల లావుడి తండా నుంచి కష్టపడి చదివి అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. 542/600 మార్కులు సాధించి జిల్లాలోనే తండాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం గొప్ప పరిణామం అన్నారు. ఇతర విద్యార్థులు కూడా కావ్యను ఆదర్శంగా తీసుకుని మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ర్యాంకు సాధించిన కావ్య ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాలోత్ రజిని,రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు కళల్లోను రాణించాలి

**వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**శిబిరం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





**గద్వాల బ్యూరో, మే2 (నినాదం) :** విద్యార్థులు చదువుతోపాటు వివిధ కళల్లోను రాణించాలని, బాల భవన్ లో వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాల బాలభ వన్ లో ఏటా నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే బాల భవన్ వ్యవస్థాపకులు, ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు, మాజీ శాసనసభ్యులు పాగ పుల్లారెడ్డి 107వ జయంతి సందర్భంగా మొదట ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో పిల్లలు సెల్ ఫోన్స్, టీవీలు చూస్తూ సమయాన్ని వృధా చేయకుండా బాల భవన్ లో నేర్పించే శాస్త్రీయ, జానపద నృత్యం, చిత్రలేఖనం, సంగీతం, తదితర అంశాలపై తర్ఫీదు పొందితే గొప్ప కళాకారు లుగా రాణించేందుకు అవకాశం ఉందన్నారు. ఒకే అంశంలో కాకుండా భిన్న రంగాల్లో శిక్షణ పొంది బహుముఖ ప్రజ్ఞాశాలురు గా పేరుపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న నృత్యం, సంగీతాన్ని వేదికలపై స్టేజ్ ఫియర్ లేకుండా ధైర్యంగా ప్రదర్శించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా త్వరలో విద్యా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, అందులో ఒకరోజు బాలభవన్ లో ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాల భవన్ విద్యార్థులతో నేర్చుకునే వివిధ అంశాల గురించి, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి మాట్లాడారు. అంతకుముందు బాల భవన్ పర్యవేక్షకులు విజయలక్ష్మి తమ పూర్వ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చూపిన ప్రతిభ, సాధించిన అవార్డులు, అక్కడ ఇస్తున్న శిక్షణ గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, డాక్టర్ అనంతలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ మంజుల రాణి, విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, మైఖేల్, శిక్షకులు పోలోజు సత్యం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో పారదర్శకతే లక్ష్యం..

**సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా..**

**ధర్మపురి అభివృద్ధికి భారీ ప్రణాళికలు: మంత్రి లక్ష్మణ్‌కుమార్**



**ధర్మపురి, మే2 (నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని పారదర్శకంగా పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. అన్నారు

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ధర్మపురి నియోజకవర్గ స్థాయి సమావేశంను శనివారం లక్ష్మీనరసింహ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించడం అని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి అధికారులు వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని శాఖల వారీగా నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలు, తాగునీటి సమస్యలు, రహదారుల లోపం, స్ట్రీట్ లైట్లు లేకపోవడం వంటి మౌలిక సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రతి సమస్యను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి పంపించి, అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. గోదావరి పుష్కరాల దృష్ట్యా ధర్మపురిలో అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి పేర్కొన్నారు. సుమారు రూ.450 కోట్ల అంచనాలతో పుష్కర ఘాట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రతిపాదనలు పంపగా, తొలి విడతగా రూ.115 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని, ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. గత రెండున్నరేళ్లలో రైతు బీమా ద్వారా వందలాది మంది రైతులకు కోట్ల రూపాయలు అందించామని, రైతు భరోసా, రుణమాఫీ పథకాల ద్వారా వేలాది మంది లబ్ధి పొందారని వివరించారు. అదేవిధంగా వ్యవసాయ యంత్రాలు, ఇళ్లు, ఉచిత విద్యుత్, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో వేలాది మందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. మక్కజొన్న రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజా పాలన ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రతి ఇంటికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, పారదర్శక పరిపాలన ద్వారా ప్రజల విశ్వాసం పొందడమే లక్ష్యమని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు అమలు చేస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు సమర్థంగా అమలు అవుతున్నాయని చెప్పారు. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి, వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రజల వినతులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్ , తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్ , వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ , దేవస్థాన మాజీ చైర్మన్ జక్కు రవీందర్ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

## ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ !

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఏపిలో కిందా మీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటులు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయిలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలె క్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాం గంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగు తోం దని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహి త్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువవుతాయని అనుకున్నారు. కానీ అసలు కలె క్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామ స్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తర ముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లు అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయారు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనేపరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటీ సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయ స్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథ కాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమిషన్లు లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకు పోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు.వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశిం చడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకు పోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్థితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# హ్యార్మజ్ జలసంధిపై కొత్త నియమాలు

పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు
ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన



**టెహ్రాన్,మే2(నినాదం):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు చేస్తామని తెలిపారు. తమ చర్యలు ఇరాన్ ప్రజలకు గర్వకారణంగా ఉంటాయన్నారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడం, విదేశీ జోక్యాన్ని తగ్గించడం, ప్రాంతీయ నియంత్రణను పెంచడం, వాణిజ్య మార్గాలను తమ ఆధీనంలో ఉంచడమే ఆ నిబంధనల లక్ష్యాలని తెలిపారు. హోర్ముజ్ జలాలు భద్రత, అభివృద్ధికి మూలంగా మారాలని తాము కోరుకుంటున్నట్లు ఐఆర్‌జీసీ పేర్కొంది . కాగా, 'పర్షియన్ గల్ఫ్ కేవలం నీలి జలాల కేంద్రం మాత్రమే కాదు. అది మన గుర్తింపు. మన నాగరికతలో ఒక భాగం. ప్రపంచ దేశాల మధ్య అనుసంధాన కేంద్రం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం' అని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్న విదేశీ బలగాలకు ఇది ఓ హెచ్చరికగా చూడాలి. పర్షియన్ గల్ఫ్, హర్మ్యాజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మ్యాజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యాయని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' తెలిపింది. మరోవైపు.. హర్మ్యాజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మ్యాజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను మా సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు.. మరోమారు మెలిక పెట్టిన ట్రంప్



**వాషింగ్టన్,మే2(నినాదం):** పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్తాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికిప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

# పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టు కొమ్మలు?

నిద్రలో ఉన్న సమాజాన్ని మేల్కొలిపి, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి, నోరులేని అసహాయులకు అండదండై, చేదోడువాదోడై ,న్యాయా న్యాయాన్ని విషదీ కరిస్తూ,అక్రమార్కులపై కలం ఝుళిపిస్తూ, వ్యవస్థ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషిస్తూ, ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంలా నిలిచిన పత్రికలకు తమదైన రోజే ఈ ప్రపంచ పత్రికా దినోత్సవం. ప్రాథమిక హక్కుల్లో ఒకటైన భావ ప్రకటన స్వేచ్ఛను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం మే 3న ప్రపంచ పత్రిక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. నిష్పక్షపాతంగా వార్తలు అందించే జర్నలిస్టులను గౌరవించడంతోపాటు పత్రిక స్వేచ్ఛ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఈరోజు ముఖ్య ఉద్దేశం. మీడియా స్వేచ్ఛగా ,నిర్భయంగా, ఖచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందించడం దాని ధర్మం. కానీ ఆ కారణంగానే ప్రభుత్వాలు, సంస్థలు, వివిధ వ్యక్తులు మీడియాపై ఆంక్షలు విధించి పత్రిక స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్నారు. పత్రికా సంస్థలు విలేఖరులపై భౌతిక దాడులకు సైతం పాల్పడుతున్నారు . అటువంటి చర్యలను ప్రతిఘటిస్తూ సమాజాభ్యుదయానికి కంకణం కట్టుకున్న జర్నలిస్టులకు అండగా యావత్ సమాజం ఉండాలని ఆకాంక్షతో" ప్రపంచ పత్రిక దినోత్సవం" నిర్వహిస్తాం .ప్రపంచ దేశాల్లో జర్నలిస్టులు మీడియాకు ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ ఆధారంగా ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే "రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ "ఆర్ ఎస్ ఎఫ్ అనే సంస్థ ఏటా "వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్" ను విడుదల చేస్తుంది. 2025 సూచీలో మొత్తం 180 దేశాలు ఉండగా భారత్ 31.28 స్కోర్ తో 151వ స్థానంలో ఉంది .దీన్నిబట్టి దేశంలో పత్రికా స్వేచ్ఛ ఏ స్థాయిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. భారతదేశ ప్రస్తుత ర్యాంకింగ్ పత్రిక స్వేచ్ఛకు సవాళ్లు ఉన్నా యని చూపిస్తుంది. మీడియా స్వాతంత్రాన్ని మెరుగుపంచుకోవడం వల్ల ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం , ప్రపంచ విశ్వసనీతము పెంచడం, భవిష్యత్తు పత్రికా స్వేచ్ఛ సూచిక నివేదికలో ర్యాంక్ ను మెరుగుపరచుకోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.ఇది ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం 2026 యొక్క లక్ష్యమైన "శాంతియుత భవిష్యత్తు"ను రూపొందించడంతో సంపూర్ణంగా సరిపోతుంది.

**చారిత్రక నేపథ్యం.......**

ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలుండి వీటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు

**(నేడు ప్రపంచ పత్రిక దినోత్సవం)**

1991 ఏప్రిల్ 29 నుండి మే 3 వరకు నమీబియా రాజధాని విండ్ హోక్ లో "పత్రికా స్వేచ్ఛ స్వాతంత్రం "అనే అంశంపై సెమినార్ నిర్వహించింది. మే 3న పత్రికల స్వేచ్ఛ కోసం కొన్ని ప్రతిపాదనలు సూత్రాలు ప్రతిపాదించారు. దాన్ని "విండ్ హుక్ డిక్లరేషన్" గా పేర్కొంటారు దీని గుర్తుగా ప్రతి సంవత్సరం మే మూడవ తేదీన ప్రపంచవ్యాప్తంగా పత్రిక దినోత్సవం నిర్వహించుకోవాలని 1993 డిసెంబర్లో యు ఎన్ ఓ జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 1994 నుండి ఏటా ఒక థీమ్ ను నిర్ధారించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. 2026 లో "శాంతియుత భవిష్యత్తును రూపొందించడం "అని శీర్షికను ఏర్పాటు చేసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శాంతి సంభాషణ సంఘర్షణ నివారణను ప్రోత్సహించడంలో స్వేచ్ఛాయుత స్వతంత్ర పాత్రికేయం యొక్క పాత్రను ఇది ప్రముఖంగా తెలియజేస్తుంది. ఈ ప్రపంచ సదస్సును యునెస్కో జాంబియా ప్రభుత్వం సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నారు.దేశవ్యాప్తంగా పత్రికలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయో తెలుగు రాష్ట్రాల్లో కూడా పత్రికా విలేకరులు అదే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నిజం రాయాలంటే కొన్నిసార్లు వార్తలు కవర్ చేసి క్రమంలో రాజకీయ నాయకుల నుండి బెదిరింపులు, దాడులు ఎదురవుతున్నాయి. చాలా తక్కువ జీతాలతో పత్రికల్లో పని చేయవలసిన అగత్యం ఏర్పడుతుంది కాబట్టి వారు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంటారు. త్వరగా వార్తలు సేకరించి ప్రచురించాలి కాబట్టి ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుంది .నిజమైన సమాచారాన్ని గుర్తించడం జర్నలిస్టులకు కష్టతరమవుతుంది ప్రమాదకరమైన ప్రాంతాల నుండి సమాచారాన్ని సేకరించవలసి ఉంటుంది. ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ప్రజలకు సరి అయిన సమాచారాన్ని అందించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయులు ఎందరో.. మన తెలుగు రాష్ట్రాల్లో కొన్ని పత్రికలు విలువలకు వలువలుడ్చి రాజకీయ పార్టీలకు కరపత్రాలుగా మారి తాము అనుకున్నా లక్ష్యాలను చేరడం కోసం ఏ స్థాయి కి అయినా దిగజారి వ్యవహరించడం గత నాలుగు దశాబ్దాలుగా చూస్తూ ఉన్నాం. తమ వారు అధికారంలో ఉంటే బాకాలు ఊదటం లేకపోతే అధికార పక్షంపై ముప్పేట దాడి చేస్తూ విమర్శలు చేయడం ,అసత్యాలకు, అర్ధసత్యాలకు స్వీయ అభిప్రాయాలను జోడించి ప్రజలకు వండి వడ్డిస్తూ చివరకు ప్రభుత్వాలను శాసించే స్థాయికి పత్రికలు చేరుకున్నాయంటే అతిశయోక్తి కాదు. పత్రికలు ప్రభుత్వ పక్షమా, ప్రతిపక్షమా అంటే ఖచ్చితంగా ప్రజల పక్షం నిలవాల్సిన బాధ్యత వారి భుజస్కంధాల మీద ఉంటుంది. కానీ ఆర్థిక ప్రయోజనాలు పరమావధిగా మారుతున్న ఈ తరుణంలో పత్రికలు కూడా అందుకు అతీతమేమీ కాదు.అంతే కాదు ప్రభుత్వం నుండి వచ్చే వ్యాపార ప్రకటనల కోసం ఆ ప్రభుత్వానికి అనుకూలంగా వార్తలు రాస్తూ అదేదో గొప్ప జర్నలిజం అని అభిప్రాయపడే పత్రికలు కూడా ఉన్నాయి .యువత లో ఉన్న మానసిక రుగ్మతలను ,వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని కొన్ని పత్రికలు వారి అభిరుచికి తగ్గట్లు వార్తలు రాయడం చూస్తూనే ఉన్నాం .మొదటి పేజీలో ఉండాల్సిన అంశాలను మధ్యలో ఎక్కడో ఎవరికి కనపడకుండా ప్రచురించడం దిగుణీకృతం చేయాలనుకున్న అంశం ఎంత పనికిరానిదైనా దానిని మొదటి పేజీలో ప్రచురించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే శ్రీశ్రీ "పెట్టుబడికి కట్టుకథలకు పుట్టిన విష పుత్రికలు పత్రికలనీ, పత్రికలన్నీ పంజరాలలో పక్షులని వ్యాఖ్యానించడం చూసాం. నిజాం దురహంకారంపై నిప్పులు చెరిగి, తన కలంతో దుర్మార్గుల గుండెల్లో పోట్లు పొడిచి, చివరకు తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలిన "షోయబుల్లా ఖాన్" వంటి ఆదర్శ పాత్రికేయుడు మన సమాజానికి ఎంతో అవసరం.నిజం, నిష్పాక్షికత, జవాబుదారితనం, నైతికత వంటి మూల సూత్రాలకు కట్టుబడి ఉండటం, భావ ప్రకటన స్వేచ్ఛ కు నిబద్ధులై ఉండటం, వాస్తవాలను అందించడంలో ప్రాణాలను సైతం ఫణంగా పెడుతూ సమాజం కోసం పనిచేస్తూ, సమస్యలపై అధికారులను నిలదీస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రజలకు ఆపద వస్తే ఏ రక్షణ లేకున్నా ప్రజా రక్షణ లక్ష్యంగా పనిచేస్తున్న సమాచార సైనికులు అందరికీ "ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ" సందర్భంగా అభినందనలు శుభాకాంక్షలు



**ములక సురేష్**
**944 132 766**

## సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు

### కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం

**న్యూఢిల్లీ,మే2(నినాదం):** సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీం కోర్టులో సవాలు చేసింది. టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.

## లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

### ప్రదర్శనను ప్రారంభించిన అమిత్ షా



**జమ్మూ,మే2(నినాదం):** క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్ధార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్‌టన్ పెప్పె అనే బ్రిటిష్ జమీందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.

## బూదరాజు రాధాకృష్ణ జీవితం.. తెలుగు భాషకు అంకితం

తెలుగు భాషకు తన జీవనాన్ని అంకితంగా సమర్పించుకున్న వారు అరుదు. వారిలో బూదరాజు రాధాకృష్ణ ప్రముఖులు. వాక్ నిపుణత, వ్యాకరణ విలాసం, పదబంధాల పరిపుష్టతతో కూడిన ఆయన రచనలు పరిశుద్ధమైన భాషా సేవకు నిలువెత్తు నిదర్శనాలు. 'తెలుగు భాషా భక్తుడు' అనే పదం ఆయనకు అక్షరార్థంగా అంకితమవుతుంది. బూదరాజు రాధాకృష్ణ తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్టమైన వ్యక్తి. వారు కేవలం ఒక భాషా శాస్త్రవేత్తగానే కాకుండా, సీనియర్ పాత్రికేయులుగా, రచయితగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవితెలుగు సాహితీ సముద్రంలో ఎన్నో మాణిక్యాలు వెలుగుతూనే ఉన్నాయి. అటువంటి అమూల్య వెలుగులు ప్రసాదించిన మణి మాణి క్యాలలో ఒకరు బూదరాజు రాధాకృష్ణ. భాషపై అపారమైన ప్రేమ, పరిశోధనా దృక్పథం, పాత్రికేయ శ్రద్ధ, రచనా నైపుణ్యం–ఈ నాలుగు మణిపూసలతో ఆయన నిర్మించిన జీవన మార్గం తెలుగు భాషాభిమానులకు మార్గదర్శిగా నిలిచింది.బూదరాజు రాధాకృష్ణ 1932 మే 3న ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య చీరాలలో, ఉన్నత విద్య విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యా లయంలో సాగింది. భాషపై ఆసక్తితో Historical Grammar of Early Telugu Inscriptions అనే విషయంపై 1965లో డాక్టరేట్ పొందారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన భాషా అధ్యయనానికి చెందిన అపూర్వ కీర్తిగా గుర్తించబడింది. చీరాల వి.ఆర్.ఎస్. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా తన ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన రాధాకృష్ణ , తర్వాత తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాషా ప్రామాణికతకు తోడ్పడే అనేక పుస్తకాలను ఈ సమయంలో సమీకరించారు. పదవీ విరమణ అనంతరం "ఈనాడు" జర్నలిజం సంస్థ లో ప్రాచార్యులుగా పదేళ్ల పాటు సేవలందించారు. ఎంతోమంది యువ పాత్రికేయులకు భాషా శాస్త్రం, రచనా వ్యాకరణం బోధించి, వారిని సామాజిక పరిణతితో కూడిన రచయితలుగా తీర్చిదిద్దారు. "పుణ్యభూమి" శీర్షికతో 'సి. ధర్మారావు' కలం పేరుతో వందలాది వ్యాసాలు రాసారు. భాషా విలువ, సంస్కృతి పరంపర, చరిత్ర సంక్రమణ, సమకాలీన సమీక్ష వంటి అనేక అంశాలు ఆయన వ్యాసాల్లో పదునైన పరిశీలనతో కూడుకున్నవి. ఈ వ్యాసాలు ప్రజలలో పాఠనాభిరుచి పెంచేలా, ఆలోచనలను పెంచేలా ఉండేవి. రాధాకృష్ణ రచయితగా తెలుగుని ప్రభావవంతమైన భావ ప్రకటనకు ఒక పటిష్టమైన రూపకర్త. పాత్రికేయులకు మార్గదర్శకంగా "రచన రీతులు", "తెలుగుబడి" వంటి పుస్తకాలు రచించారు. మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని ఆంగ్లంలో రచించి, స్వయంగా తెలుగులోకి అనువదించారు. "మరవరాని మాటలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యంలోని అమూల్య సూక్తులను సంకలనం చేశారు.అంతేకాక, నోమ్ చాంస్కీ, కార్ల్ మార్క్స్, గుల్జార్ వంటి రచయితల రచనలను తెలుగులోకి అనువదించి భావానువాదానికి అర్థవంతమైన ప్రమాణాలు నెలకొల్పారు. తెలుగు భాషే తన ముక్తిపథం అని నమ్మి జీవితాంతం అదే వైపు నడిచిన బూదరాజు రాధాకృష్ణ , సాహిత్యాన్ని మానవీకరించిన సాహితీ వేత్త గానే నిలిచారు. ఆయన రచనలు భాషానురాగులకు ఆదర్శంగా, పాత్రికేయులకు పాఠశాలలా నిలిచాయి. తెలుగు భాషా పట్ల ఆయన కలిగిన భక్తి సజీవంగా శబ్దంలో, వాక్యంలో, వ్యాసంలో ఇప్పటికీ స్పందిస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## సిలిండర్ ధరను 1000 వరకు పెంచడం కేంద్ర పెద్దల క్రూరత్వానికి పరాకాష్ట

అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే వాణిజ్య సిలిండర్ ధరను 1000 వరకు పెంచడం కేంద్ర ప్రభుత్వ పెద్దల క్రూరత్వానికి పరాకాష్టగా చెప్పొచ్చు. దేశం, ధర్మం కోసం ప్రతినిత్యం నీతి సూత్రాలు చెప్పే బీజేపీ నాయకులు ఇప్పుడు దేశ ప్రజలకు ఏం సమాధానం చెప్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.

కేంద్రంలోని బీజేపీ పెద్దలకు ఎన్నికలు, కలెక్షన్ల మీద ఉన్న శ్రద్ధ దేశ ప్రజల సమస్యలపై లేదని ఇది స్పష్టమవుతోంది. ఎన్నికలు పూర్తయ్యాక వెంటనే ధరలు పెంచడం వారి చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల దాదాపు 145 కోట్ల మంది ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారం పడుతోంది. ఇప్పటికే బల్క్ డీజిల్ వినియోగించే సంస్థలపై అదనంగా ?12 వరకు ధరలు పెంచి ప్రజలపై మరింత భారాన్ని మోపుతున్నారు.

కొన్ని రాష్ట్రాల్లో నెలవారీ గ్యాస్ ఖర్చులు ?1500 వరకు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విధంగా ఎడా పెడా ధరలు పెంచడం వల్ల సాధారణ ప్రజల జీవితం కష్టసాధ్యమవుతోంది.

ఎన్నికల ముందు ఘుష్ట్రబశ్రీ +ఘుఅస్త్రఱ చెప్పినట్లే, ఎన్నికలు పూర్తయ్యాక ధరలు పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వ అసలు ఉద్దేశ్యం బయటపడింది.

అంతేకాక, త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అరాచక పాలన, పన్నుల పెంపు, ప్రజావ్యతిరేక విధానాలను దేశ ప్రజలు ఖండించాల్సిన సమయం ఆసన్నమైంది.

అంతర్జాతీయ మార్కెట్ ధరలను సాకుగా చూపుతూ అవసరమైన వస్తువులపై పన్నులు పెంచడం ఎంతవరకు సమంజసం? వెంటనే ఫ్యూయల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాం.

ధరలను నియంత్రించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, పన్నులు పెంచుతూ ప్రజలపై భారాలు మోపడం దురదృష్టకరం. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు.

ప్రజలే సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారు.



**బండి సుధాకర్ గౌడ్**
**టీపీసీసీ అధికార ప్రతినిధి**

# కాకతీయుల గనుల నుండి బ్రిటిష్ కిరీటం వరకు కోహినూర్ అలుపెరుగని ప్రయాణం

భారతదేశ చరిత్ర కేవలం రాజులు, రాజ్యాల కథ మాత్రమే కాదు; అది అపారమైన సంపదకు, సామ్రాజ్య వైభవానికి, వలసవాద దోపిడీకి చెక్కుచెదరని జాతీయ ఆత్మగౌరవానికి నిలువుటద్దం. ఈ పరిణామాలన్నింటికీ ఏకైక మూగసాక్షిగా, 'కోహినూర్' వజ్రం కాలగమనంలో ఒక అరుదైన చిహ్నంగా నిలిచింది. పర్షియన్ భాషలో 'కోహ్-ఇ-నూర్' అంటే 'వెలుగుల పర్వతం' అని అర్థం. ఈ పేరుకు తగ్గట్టే, ఈ వజ్రం తన కాంతితో ప్రపంచ పాలకులను ఆకర్షించింది, తన వైభవంతో సామ్రాజ్యాల మధ్య యుద్ధాలకు కారణమైంది, చివరకు వలసవాద పాలనలో ఒక జాతి సాంస్కృతిక ఆవేదనకు ప్రతీకగా మిగిలిపోయింది. నేడు లండన్ టవర్‌లోని బ్రిటిష్ రాజకుటుంబ కిరీట ఆభరణాల్లో అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ వజ్రం, భారతదేశ చారిత్రక వారసత్వాన్ని పునరుద్ధరించాలనే కోట్లాదిమంది భారతీయుల ఆకాంక్షకు ప్రతిరూపం.

ఈ అపురూప రత్నం మూలాలు దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంటూరు జిల్లాలోని కొల్లూరు గనులతో విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నాయి. కృష్ణా నదీ తీరంలోని ఈ ప్రాంతం ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ వజ్రాలకు నిలయంగా ఉండేది. క్రీస్తుశకం 13వ శతాబ్దంలో కాకతీయుల పాలనలో ఈ వజ్రం వెలుగులోకి వచ్చిందని చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు. వరంగల్ కోటలోని భద్రకాళి అమ్మవారి నేత్రంగా ఈ వజ్రం వెలిగిందని జనశ్రుతి. ఆ సమయంలో దీని అసలు బరువు సుమారు 793 క్యారెట్లుగా ఉండేదని, నాటి ప్రపంచంలోనే ఇది అతిపెద్ద వజ్రంగా గుర్తింపు పొందిందని విశ్లేషకులు భావిస్తారు. ప్రస్తుత కొలతల ప్రకారం, ఈ వజ్రం 105.602 క్యారెట్ల బరువుతో, 3.6 సెంటీమీటర్ల పొడవు, 3.2 సెంటీమీటర్ల వెడల్పు, 1.3 సెంటీమీటర్ల లోతును కలిగి ఉంది. దీనికి 66 ముఖాలు ఉండటం వల్ల దీని పరావర్తన



కాంతి అద్వితీయంగా ఉంటుంది. 1980లో స్టీఫెన్ హోవర్త్ తన 'ది కోహినూర్ డైమండ్ -- ది హిస్టరీ అండ్ ది లెజెండ్' అనే గ్రంథంలో ఈ వజ్రం కొల్లూరు గనుల్లోనే దొరికిందని ఆధారాలతో నిరూపించారు.

కోహినూర్ ప్రయాణం భారత ఉపఖండంలో జరిగిన రాజకీయ కుట్రలకు, దండయాత్రల చరిత్రకు ప్రతిబింబం. 1323లో ఢిల్లీ సుల్తానేట్ సేనలు ఉలుగ్ ఖాన్ నాయకత్వంలో వరంగల్‌పై దాడి చేసి కాకతీయ సామ్రాజ్యాన్ని కూల్చినప్పుడు, ఈ వజ్రం మొదటిసారిగా దక్షిణ భారతాన్ని విడిచి ఢిల్లీకి తరలించబడింది. అనంతరం ఇది ఖిల్జీలు, తుగ్లక్‌లు, సయ్యద్‌లు లోడీ వంశాల చేతులు మారి చివరకు మొఘల్ సామ్రాజ్య వ్యవస్థాపకుడైన బాబర్ హస్తగతమైంది. బాబర్ తన స్వీయ చరిత్ర 'బాబర్నామా'లో ఈ వజ్రం విలువ గురించి ప్రస్తావిస్తూ, "ప్రపంచం మొత్తానికి ఒక రోజుకు అయ్యే ఖర్చును ఈ ఒక్క వజ్రం తీర్చగలదు" అని అభివర్ణించాడు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ హయాంలో అత్యంత విలాసవంతమైన 'పీకాక్ థ్రోన్' (మయూర సింహాసనం) లో ఈ వజ్రాన్ని పొందుపరిచారు. అంటే, ఇది కేవలం ఒక ఆభరణం కాదు, సార్వభౌమాధికారానికి అసలు సిసలైన నిదర్శనంగా మారింది.

మొఘల్ సామ్రాజ్యం క్షీణదశకు చేరుకున్న సమయంలో, 1739లో పర్షియా పాలకుడు నాదిర్ షా ఢిల్లీపై దండెత్తి అపారమైన సంపదతో పాటు ఈ వజ్రాన్ని కూడా తన వెంట తీసుకెళ్లాడు. ఆ వజ్రం యొక్క అద్భుత మెరుపును చూసి నిశ్చేష్టుడైన నాదిర్ షా, దానిని మొదటిసారిగా 'కోహ్-ఇ-నూర్' అని సంబోధించాడు. నాదిర్ షా మరణానంతరం, ఈ వజ్రం అఫ్ఘాన్ పాలకుడైన అహ్మద్ షా దురానీకి దక్కింది. సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు అఫ్ఘానిస్థాన్‌లో ఉన్న ఈ రత్నం, 1813లో అప్పటి అఫ్ఘాన్ రాజు షా షుజాను సిక్కు సామ్రాజ్య స్థాపకుడు మహారాజా రంజిత్ సింగ్ రక్షించినప్పుడు కృతజ్ఞతా పూర్వకంగా తిరిగి భారత్‌కు చేరింది. రంజిత్ సింగ్ దీనిని తన బాహువుకు ధరించి, సిక్కు రాజ్య అచంచల వైభవానికి చిహ్నంగా మార్చాడు. రంజిత్ సింగ్ మరణం తర్వాత పంజాబ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరతను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అత్యంత చాకచక్యంగా వాడుకుంది. రెండో ఆంగ్లో-సిక్కు యుద్ధం తర్వాత 1849లో కుదిరిన 'లాహోర్ ఒప్పందం' ద్వారా అప్పటి పదేళ్ల బాలుడు, సిక్కు రాజు మహారాజా దులీప్ సింగ్ చేత బ్రిటిష్ వారు బలవంతంగా కోహినూర్‌ను విక్టోరియా రాణికి అప్పగింపజేశారు. ఈ ఒప్పందంపై సంతకం చేసే సమయంలో దులీప్ సింగ్ వయస్సు ఆయనపై ఉన్న రాజకీయ ఒత్తిడిని గమనిస్తే, ఇది స్వచ్ఛందంగా ఇచ్చిన బహుమతి కాదని, వలసవాద ఆధిపత్యం చేసిన దోపిడీ అని స్పష్టమవుతుంది.

1850లో కోహినూర్‌ను బ్రిటన్‌కు తరలించి, క్వీన్ విక్టోరియాకు బహూకరించారు. అయితే, బ్రిటన్ వాతావరణంలో దీని మెరుపు తక్కువగా ఉందని భావించి, 1852లో డచ్ వజ్రాల నిపుణులచే దీనిని తిరిగి చెక్కించారు. ఈ ప్రక్రియలో వజ్రం బరువు 186 క్యారెట్ల నుండి 105.6 క్యారెట్లకు తగ్గిపోయింది. అయినప్పటికీ, దీని చారిత్రక ప్రాధాన్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 నుంచే ఈ వజ్రాన్ని తిరిగి రప్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. 1953లో క్వీన్ ఎలిజబెత్-2 పట్టాభిషేక సమయంలో భారత ప్రభుత్వం దీనిపై అధికారిక విన్నపం చేసింది. ఆ సమయంలో రాజ్యసభలో 50 మంది ఎంపీలు సంతకాలు చేసి దీనిని తిరిగి భారత్‌కు తేవాలని తీర్మానం చేయడం గమనార్హం. 1976లో పాకిస్థాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో కూడా ఈ వజ్రంపై హక్కును ప్రకటించగా, అఫ్ఘానిస్థాన్ కూడా దీనిని తమదిగా క్లెయిమ్ చేసింది. కానీ, వజ్రం వెలికి తీయబడిన గోల్కొండ గనులు, కాకతీయ సిక్కు సామ్రాజ్యాల వారసత్వం భారతదేశ వాదనకు తిరుగులేని చారిత్రక ప్రాతిపదికను కల్పిస్తున్నాయి. కోహినూర్ విలువను ఆర్థికంగా లెక్కకట్టడం అసాధ్యం. దీని విలువ సుమారు ?200 మిలియన్ల నుండి ?1 బిలియన్ల వరకు ఉండవచ్చని అంచనా వేసినప్పటికీ, దీని చారిత్రక సాంస్కృతిక విలువ వెలకట్టలేనిది. కోహినూర్ తిరిగి రావడం అంటే కేవలం ఒక రత్నం రావడం కాదు, వలసవాద కాలంలో జరిగిన సాంస్కృతిక దోపిడీకి వ్యతిరేకంగా ఒక దేశం సాధించే చారిత్రక విజయం. ఇది కోట్లాది మంది భారతీయుల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న అంశం. 'ఆపరేషన్ కోహినూర్' వంటి అధికారిక ప్రయత్నాల ద్వారా ఈ 'వెలుగుల పర్వతం' తన పుట్టినగడ్డకు, కృష్ణా నదీ తీరానికి చేరుతుందనే ఆశ ప్రతి భారతీయుడిలోనూ సజీవంగా ఉంది. భవిష్యత్తులో దౌత్యపరమైన వ్యూహాలు ఫలించి, ఈ అపురూప రత్నం భారతదేశపు మకుటంలో మళ్ళీ చేరాలని ఆశిద్దాం.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494

# చెరకు రసం పొరబాటున కూడా వీరు తాగకూడదు?



వేసవిలో వేడి తాపం నుంచి ఉపశమనం కోసం ద్రవరూపంలో ఉండే ఆహారం అధిక మంది తీసుకుంటూ ఉంటారు. అందుకే కొబ్బరి నీరు, చెరకు రసం వంటి రకరకాల ఆరోగ్యకరమైన పానీయాలను ఈ కాలంలో తాగుతుంటారు.ఇవి శరీరాన్ని చల్లబరుస్తాయి. అధిక మంది వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. కానీ మీకు తెలుసా... చెరకు రసం అందరికీ మంచిది కాదు. ఆరోగ్య నిపుణుల ప్రకారం కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని మితంగా లేదా పూర్తిగా మానుకోవడం మంచిదని అంటున్నారు. చెరకు రసం ఎవరికి మంచిది కాదో? అది ఎలాంటి ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందో ఇక్కడ తెలుసుకుందాం.



**మధుమేహం ఉన్నవారికి యమ డేంజర్**

వైద్యుల ప్రకారం మధుమేహం ఉన్నవారు చెరకు రసం తాగడం చాలా ప్రమాదకరం. ఇందులో సహజ చక్కెర అధికంగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. అందువల్ల రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోలేని వారు దీనిని తాగకపోవడమే మంచిది.

**అధిక బరువు**

అధిక బరువు (ఊబకాయం) ఉన్నవారు కూడా చెరకు రసం తాగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఈ పానీయంలో కేలరీలు అధికంగా ఉంటాయి. ఇది మరింత బరువు పెరగడానికి దారితీస్తుంది. వైద్యుల సలహాతో వారానికి ఒకసారి



మాత్రమే.. అదీ మితంగా దీనిని తీసుకోవాలి.

**జీర్ణ సమస్యలు ఉన్నవారు**

అజీర్ణం, గ్యాస్ట్రిక్, కడుపు నొప్పి సమస్యలు ఉన్నవారు చెరకు రసానికి దూరంగా ఉండాలి. కొన్నిసార్లు ఇది జీర్ణ సమస్యలను తీవ్రతరం చేసి, కడుపులో అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**చెరకు రసం సేవించేటప్పుడు గమనించవలసిన విషయాలు**

చెరకు రసాన్ని ఎల్లప్పుడూ తాజాగా, శుభ్రంగా అప్పటికప్పుడు తయారు చేసుకుని తాగాలి. ఖాళీ కడుపుతో తాగడం మానుకోవాలి. అధిక పరిమాణంలో తాగడం ఆరోగ్యానికి హానికరం. కానీ దీని ప్రయోజనం అందరికీ సమానంగా ఉండదు. ముఖ్యంగా మధుమేహం, అధిక బరువు, జీర్ణ సమస్యలు ఉన్నవారు వైద్యుని సలహాతో మేరకు మాత్రమే దీనిని తీసుకోవాలి.

# పిల్లలు ఆలస్యంగా మాట్లాడటానికి కారణం ఇదేనట..!

**తల్లిదండ్రులు ఇప్పుడు చిన్న పిల్లలకు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు కూడా ఇస్తున్నారు. ఈ స్క్రీన్‌లు పిల్లల జీవితంలో ఒక భాగం అవుతున్నాయి.. కానీ అధిక స్క్రీన్ సమయం వారి అభివృద్ధి, మానసిక ఎదుగుదల పై ప్రభావం చూపుతుంది. ఇది మాటల సమస్యలకు కూడా దారితీయవచ్చు. సాధారణ పిల్లలతో పోలిస్తే, అధిక స్క్రీన్ సమయం గడిపే పిల్లలు మాటలు ఆలస్యంగా రావడం వంటి సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ జరిపిన ఒక అధ్యయనంలో ఈ సమాచారం వెల్లడైంది.**

ఈ పరిశోధన 18 నుండి 24 నెలల వయస్సు గల 140 మంది ఆరోగ్యకరమైన పిల్లలపై నిర్వహించారు. ప్రతిరోజూ గంటకు పైగా స్క్రీన్‌లను ఉపయోగించే పిల్లలకు మాటలు ఆలస్యంగా వచ్చే ప్రమాదం ఉందని ఈ అధ్యయనంలో తేలింది. 18 నెలల వయస్సు రాకముందే పిల్లలను స్క్రీన్‌లను ఉపయోగించడానికి అనుమతించకూడదని కూడా ఈ పరిశోధన సూచిస్తుంది.

**18 నెలల లోపు స్క్రీన్‌కు గురికావడం ఎందుకు ఆందోళన కలిగిస్తుంది?**

మాటలు ఆలస్యంగా రావడం ఎక్కువగా ఉన్న పిల్లలు 18 నెలల వయస్సు రాకముందే స్క్రీన్‌కు



గురికావడం మొదలు పెట్టారని పరిశోధనలో తేలింది. పిల్లల మెదడు అభివృద్ధికి తొలి సంవత్సరాలు చాలా కీలకమని నిపుణులు అంటున్నారు. ఈ సమయంలో స్క్రీన్‌ను అధికంగా వాడటం పిల్లల మానసిక వికాసంపై ప్రభావం చూపుతుంది.

ఈ వయసులో పిల్లలను ఫోన్ వాడటానికి అనుమతించడం వారి మానసిక ఎదుగుదలలో సమస్యలకు దారితీయవచ్చు. దీనివల్ల సంభాషణలో ఆలస్యం, మాటలు నేర్చుకోవడంలో కూడా ఆలస్యం జరగవచ్చు. వేగంలో ఆలస్యం అనేక కారణాల వల్ల సంభవించినప్పటికీ, స్క్రీన్ టైమ్ ఒక ప్రధాన కారకమని పరిశోధనలు గుర్తించాయి.

**పిల్లలకు ఎంత స్క్రీన్ సమయం సరైనది?**

పరిశోధనల ప్రకారం, 2 సంవత్సరాల లోపు పిల్లలకు స్క్రీన్ సమయాన్ని పూర్తిగా సున్నాకు పరిమితం చేయాలి.. కానీ అప్పుడప్పుడు వీడియో కాల్స్‌లో మాట్లాడటానికి వారిని అనుమతించాలి. పిల్లలను కార్టూన్‌లు లేదా ఇతర కార్యకలాపాలలో నిమగ్నం చేయడానికి స్క్రీన్ సమయాన్ని ఉపయోగించవద్దు. మొదట్లో ఇది మీ పిల్లలను నిమగ్నం చేస్తున్నట్లు అనిపించవచ్చు.. కానీ దాని దుష్ప్రభావాలు తర్వాత స్పష్టమవుతాయి.

# హైదరాబాద్‌లో ఇవానా జువెల్స్



**హైదరాబాద్, మే 2 (నినాదం) :** ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ ఇవానా జువెల్స్ దక్షిణ భారత మార్కెట్‌పై దృష్టి సారిస్తూ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. రాజ్‌భవన్ రోడ్‌లో సంస్థ తన 11వ స్టోర్‌ను ప్రారంభించింది. డిజిటల్ బ్రాండ్‌గా ప్రారంభమైన ఇవానా జువెల్స్ ఇప్పటికే ఢిల్లీ, ముంబై, పూణే, సూరత్ వంటి ప్రధాన నగరాల్లో విస్తరించి, "ఫిజిటల్" మోడల్ ద్వారా వినియోగదారులకు ప్రత్యక్ష అనుభూతిని అందిస్తోంది. ల్యాబ్-గ్రోన్ డైమండ్ పోల్కీ విభాగంలో సంస్థ మార్కెట్ లీడర్‌గా ఎదిగింది. సూరత్‌లోని స్వంత తయారీ కేంద్రం ద్వారా ఐజీఐ, ఎస్‌జీఎల్ సర్టిఫైడ్ వజ్రాలతో నాణ్యమైన ఆభరణాలను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. హైదరాబాద్ వంటి నగరాల్లో సంప్రదాయం మరియు ఆధునికత కలయికకు మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొంది. బీఐఎస్ హాల్‌మార్క్‌తో కూడిన గోల్డ్, ల్యాబ్-గ్రోన్ డైమండ్ ఆభరణాలతో పాటు బైబ్యాక్, ఎక్స్ఛేంజ్ సదుపాయాలు కూడా అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

# ఏవియేషన్ కాలేజీలో నియామక డ్రైవ్




**హైదరాబాద్ బ్యూరో, మే 2 (నినాదం):** ఎయిర్ ఆసియా ఇటీవల చెన్నైలోని అమిర్తా ఇంటర్నేషనల్ ఏవియేషన్ కాలేజీలో నిర్వహించిన నియామక డ్రైవ్, విమానయాన పరిశ్రమ మరియు విద్యా రంగం మధ్య సహకారాన్ని బలోపేతం చేసే ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ శిక్షణను వాస్తవ ప్రపంచ అవసరాలతో అనుసంధానించుకునే అవకాశాన్ని పొందడంతో పాటు, అంతర్జాతీయ స్థాయి విమానయాన వృత్తుల్లో ప్రవేశించే మార్గాలను విస్తరించుకోవడానికి సహాయపడుతోంది.ఇలాంటి నియామక కార్యక్రమాలు కేవలం ఉద్యోగావకాశాలకే పరిమితం కావు; అవి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి విద్యాసంస్థలతో కలిసి పనిచేసే దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. విద్యార్థులకు ఇది ప్రామాణిక నియామక ప్రక్రియలపై అవగాహన కల్పిస్తూ, స్పష్టమైన వృత్తి మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. భారతదేశం వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లో, ఈ విధమైన భాగస్వామ్యాలు నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేయడంలో కీలకంగా మారుతున్నాయి. భవిష్యత్తులో ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త పాఠ్య ప్రణాళికలు, ధృవీకరణ కార్యక్రమాల రూపంలో మరింత బలమైన పరిశ్రమ-విద్యా అనుసంధానం ఏర్పడే అవకాశం ఉంది.

## అంజన్న ఆశీస్సులుంటే

# అన్నిట్లోనూ విజయాలే

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల, మే 2(నినాదం):** అంజన్న ఆశీస్సులుశీటే అన్ని రంగాల్లో విజయాలే వరిస్తాయిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని పాటి హనుమాన్ ఆలయంలో శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకుని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెజ్జారపు శ్రీనివాస్, బూస రాజేశ్వర్, అర్చకులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల రుణాన్ని కేవలం 17 ఏళ్లలోనే తీర్చేయొచ్చు.. ఎలాగో తెలిస్తే ఆశ్చర్యపోతారు..!

చాలా మంది సొంత ఇల్లు అనే కలను నెరవేర్చుకోవడానికి ఇల్లు కట్టుకోవడానికి లేదా కొనడానికి బ్యాంకుల నుండి గృహ రుణాలు తీసుకుంటారు. అయితే, ఆ రుణ భారం దాన్ని తిరిగి చెల్లించేటప్పుడే తెలుస్తుంది. రుణాన్ని త్వరగా, సులభంగా ఎలా తిరిగి చెల్లించాలో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు.

సాధారణంగా బ్యాంకులు అందించే గృహ రుణాలపై అధిక వడ్డీ రేట్లు ఉంటాయి. దీని కారణంగా రుణాన్ని తిరిగి చెల్లించడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. ఈ పరిస్థితిలో 30 సంవత్సరాల రుణాన్ని 17 సంవత్సరాలలో ఎలా తిరిగి చెల్లించాలో, వడ్డీని తగ్గించడం ద్వారా తక్కువ ఎలా చెల్లించాలో చూద్దాం.

ఉదాహరణకు.. ఒక వ్యక్తి రూ. 50 లక్షల గృహ రుణం తీసుకున్నారని అనుకుందాం. ఆ రుణంపై 8 శాతం వడ్డీ రేటు, 30 సంవత్సరాల తిరిగి చెల్లింపు వ్యవధి ఉందని అనుకుందాం. ఈ సందర్భంలో నెలవారీ వాయిదా రూ. 36,688 అవుతుంది.





దీని అర్థం ఏమిటంటే.. ఒకవేళ ఆ వ్యక్తి 20 సంవత్సరాలలో రుణాన్ని తిరిగి చెల్లించాలని నిర్ణయించుకుంటే అతను నెలవారీ వాయిదాలలో రూ. 41,822 చెల్లించాల్సి ఉంటుంది. తిరిగి చెల్లించే కాలాన్ని 30 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలకు తగ్గించడం ద్వారా తిరిగి చెల్లించే కాలం తగ్గడమే కాకుండా, వడ్డీ కూడా గణనీయంగా తగ్గుతుంది. దీనికి అదనంగా ప్రతి నెలా ఒక అదనపు వాయిదా చెల్లించడం వల్ల ప్రయోజనాలు కలుగుతాయి.

సంవత్సరానికి 12 నెలవారీ వాయిదాలకు అదనంగా మరో నెలవారీ వాయిదా చెల్లించడం వల్ల మీ రుణాన్ని వేగంగా తీర్చవచ్చు. అంటే, సంవత్సరానికి 12 నెలవారీ వాయిదాలకు బదులుగా 13 నెలవారీ వాయిదాలు చెల్లించడం వల్ల 30 ఏళ్ల రుణాన్ని కేవలం 17 ఏళ్లలోనే తిరిగి చెల్లించవచ్చు.




# విమాన సర్వీసులు నిలిపివేసిన స్పిరిట్ ఎయిర్ లైన్స్.. ఇంధన ధరలే




అమెరికాకు చెందిన ప్రముఖ అల్ట్రా-లో-కాస్ట్ విమానయాన సంస్థ 'స్పిరిట్ ఎయిర్‌లైన్స్' తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసింది. సుమారు 500 మిలియన్ డాలర్ల రెస్క్యూ డీల్ విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ప్రకటించింది. దీనివల్ల విమాన ప్రయాణ ధరలు భారీగా పెరగడమే కాకుండా, వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక ప్రధాన బడ్జెట్ ఎయిర్‌లైన్ మార్కెట్ నుండి తప్పుకోవడంతో సీట్ల లభ్యత తగ్గి, డిమాండ్ పెరగడం వల్ల విమాన ఛార్జీలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

సిబిఎస్ (జదీూ) న్యూస్ గణాంకాల ప్రకారం.. ఇప్పటికే విమాన ప్రయాణ ధరలు 23 శాతం మేర పెరిగాయి. అంటే ఒక రౌండ్ ట్రిప్‌పై సగటున 60 డాలర్ల అదనపు భారం పడుతోంది. గత మార్చిలో బాండ్ హోల్డర్లతో కుదుర్చుకున్న పునర్నిర్మాణ ఒప్పందం ద్వారా కంపెనీని గట్టెక్కించాలని భావించినప్పటికీ, ఇటీవల ఇంధన ధరలు అసాధారణంగా పెరగడం వల్ల ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని స్పిరిట్ ఏవియేషన్ హోల్డింగ్స్ సీఈఓ డేవ్ డేవిస్ తెలిపారు. సంస్థను కొనసాగించే ప్రత్యామ్నాయం లేకపోవడంతో దశలవారీగా మూసివేత ప్రక్రియను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

**ప్రయాణికులకు ఊరట చర్యలు**

స్పిరిట్ నిష్క్రమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు యునైటెడ్, అమెరికన్ ఎయిర్‌లైన్స్ వంటి ఇతర సంస్థలు ముందుకు వస్తున్నాయి. అమెరికన్ ఎయిర్‌లైన్స్ కీలక మార్గాల్లో 'ఫేర్ క్యాప్స్' (ధరల పరిమితి) విధిస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఇతర విమానయాన సంస్థలు తమ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తన విమానాలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు.. ప్రయాణికులకు టికెట్ సొమ్మును తిరిగి చెల్లిస్తామని (=వటబఅంం) హామీ ఇచ్చింది.

**రీఫండ్ ప్రక్రియ, సూచనలు**

క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల ద్వారా బుక్ చేసుకున్న ప్రయాణికులకు ఆటోమేటిక్ గా వారి ఖాతాల్లోకే నగదు జమ అవుతుందని సంస్థ తెలిపింది. అయితే.. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న వారు నేరుగా సంబంధిత ఏజెంట్లను సంప్రదించాల్సి ఉంటుంది. వోచర్లు, క్రెడిట్స్ లేదా రివార్డ్ పాయింట్ల ద్వారా బుక్ చేసిన వారికి బ్యాంక్రప్సీ (దివాలా) విచారణ ప్రక్రియ ముగిసిన తర్వాతే రీఫండ్ విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణికులు తమ ప్రయాణాల కోసం ఇతర విమానయాన సంస్థల్లో ముందస్తుగా రీబుకింగ్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఐపీ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో భారత్




**వాషింగ్టన్:** మేధో సంపత్తి (ఐపీ) హక్కుల పరిరక్షణ, అమలు విషయంలో తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న దేశాల్లో భారత్ ఒకటని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) ప్రకటించింది. 6 దేశాలతో 'ప్రాధాన్య పర్యవేక్షణ జాబితా'ను యూఎస్‌టీఆర్ విడుదల చేసిన ప్రత్యేక నివేదికలో వెల్లడించింది. ఇందులో భారత్, చైనా, ఇండోనేషియా, చిలీ, రష్యా, వెనెజువెలా ఉన్నాయి. ప్రాధాన్య దేశం (పీఎఫ్‌సీ)గా వియత్నాంను పేర్కొంది. దీని ప్రకారం.. ఐపీల విషయంలో వియత్నాంపై కఠిన నిఘాను యూఎస్ పెట్టనుంది. పీఎఫ్‌సీ విభాగంలో గత 13 ఏళ్లలో ఒక దేశానికి చోటు దక్కడం ఇదే తొలిసారి. అమెరికా ఉత్పత్తులపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపేలా ఐపీ సంబంధిత చర్యలు, విధానాలు, పద్ధతులు ఉన్న దేశాల కోసం పీఎఫ్‌సీ గుర్తింపు కేటాయించినట్లు యూఎస్‌టీ ఆర్ తెలిపింది. ఐపీ హక్కుల పరిరక్షణ విషయంలో చర్చలు జరిపేందుకు, చర్చల్లో గణనీయ పురోగతి సాధించేందుకు వియత్నాం నుంచి సరైన స్పందన ఉండటం లేదని వెల్లడించింది. కృత్రిమ మేధ పరిరక్షణ, అమలు విషయంలో అమెరికాలోని వ్యక్తులకు సమస్యలు ఎదురవుతున్న దేశాలను ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో యూఎస్‌టీఆర్ చేరుస్తుంది. అనైతిక వాణిజ్య విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించడమే తమకు అత్యంత ప్రాధాన్యమని యూఎస్‌టీఆర్ తెలిపింది.

# బీమా రంగంలోకి 100% FDI.. నోటిఫై చేసిన కేంద్రం

**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీమా రంగంలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌డీఐల విషయంలో ఎల్ఐసీకి మినహాయింపు ఇచ్చింది. ఆ సంస్థలోకి గరిష్ఠంగా 20 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు అనుమతించేలా పరిమితి విధించింది.

ప్రస్తుతం బీమా సంస్థల్లో 74 శాతం వరకు మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఉంది. ఇకపై విదేశీ సంస్థలు భారతీయ భాగస్వామి లేకుండానే 100 శాతం పెట్టుబడితో బీమా వ్యాపారంలోకి అడుగుపెట్టొచ్చు. అయితే, ఖీణ× పొందే కంపెనీలు బీమా, సంబంధిత కార్యకలాపాలను నిర్వహించడానికి భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (×=ణూ×) నుంచి అవసరమైన లైసెన్స్ తప్పనిసరిగా పొందాలి అని కేంద్రం తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. కంపెనీలో కీలక పదవులైన ఛైర్మన్,



మేనేజింగ్ డైరెక్టర్ లేదా సీఈఓలో కనీసం ఒక్కరైనా భారతీయ పౌరుడై ఉండాలన్న నిబంధననూ పొందుపరిచారు.

# ఆర్‌బీఐ డిప్యూరిటీ గవర్నర్‌గా రోహిత్ జైన్ నియామకం





దిశ, బిజినెస్ బ్యూరో: భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా రోహిత్ జైన్‌ను ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు. ఈ నియామకం మే 3 నుంచి అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం పదవీకాలం ముగియనున్న టి రబీ శంకర్ స్థానాన్ని రోహిత్ జైన్ భర్తీ చేసే అవకాశం ఉంది. రోహిత్ జైన్‌కు ఆర్‌బీఐలో దాదాపు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. 2020, డిసెంబర్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన ఆయన, పర్యవేక్షణ, మానవ వనరుల నిర్వహణ, బ్యాంకింగ్ రంగాల్లో పని చేశారు. ముఖ్యంగా రిస్క్ అనలిటిక్స్, వల్నరబిలిటీ అసెస్‌మెంట్ వంటి ముఖ్యమైన విభాగాల్లో కీలక పాత్ర పోషించారు. కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆయన, బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన పలు ప్రొఫెషనల్ సర్టిఫికేషన్లు పూర్తి చేశారు. ఆర్‌బీఐలోని నలుగురు డిప్యూటీ గవర్నర్లలో ఇద్దరు అంతర్గతంగా పదోన్నతి పొందినవారే కావడం గమనార్హం. ప్రస్తుతం ఆర్‌బీఐలో మరో ముగ్గురు డిప్యూటీ గవర్నర్లు ఎస్.సి. ముర్ము, పూనమ్ గుప్తా, స్వామినాథన్ జె ఉన్నారు.

# తొలి డిజిటల్ లాకర్-ఫోకస్డ్ బ్రాంచ్ ప్రారంభించిన యాక్సిస్ బ్యాంక్

ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ శనివారం తన తొలి డిజిటల్ లాకర్-ఫోకస్ బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఆధునిక టెక్నాలజీ, ఆటోమేషన్, భద్రతా ప్రమా ణాలతో వినియోగదారులకు కొత్త తరహా బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడమే ఈ బ్రాంచ్ లక్ష్యమని బ్యాంకు తెలిపింది. దేశంలో డిమాండ్ కారణంగా సేఫ్-డిపాజిట్ లాకర్ల అవసరం ఎక్కువైంది. ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు యాక్సిస్ బ్యాంక్ తన డిజిటల్ లాకర్-ఫోకస్ బ్రాంచులతో కొత్త మోడల్‌ను తీసుకొచ్చింది. ప్రీమియం ఏరియాల్లో కాంపాక్ట్ ఫార్మాట్‌లో ఏర్పాటుచేసిన ఈ బ్రాంచ్‌లు, వినియోగదారులకు చేరువలో ఉంటాయి. టెక్నాలజీ ఆధారిత సేవల ద్వారా మారుతున్న అవసరాలను ఇవి తీరుస్తాయని బ్యాంకు చెబుతోంది. ఈ బ్రాంచ్‌లలో భద్రతా ఏర్పాట్లు చాలా ఆధునికంగా ఉంటాయి. లాకర్లు ఉండే వాల్ట్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా నిరంతర నిఘా, ముఖ్యంగా కస్టమర్లకు 24 గంటల యాక్సెస్ ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఈ బ్రాంచ్‌లో రోబోటిక్ టెక్నాలజీని కూడా ఉపయోగించారు. లాకర్‌ను యాక్సెస్ చేసినప్పుడు, ఆ సిస్టమ్ లాకర్‌ను నేరుగా ప్రైవేట్ లాంజ్‌లోకి తీసుకువస్తుంది. అలాగే, ఫిజికల్ కీ అవసరం లేకుండా బయోమెట్రిక్, మల్టీ-లేయర్ సెక్యూరిటీ ఉంటుందని బ్యాంకు వెల్లడించింది.

# విమానయాన సంస్థలకు ఎఫ్‌డీటీఎల్ సడలింపులు వద్దు



పైలట్లు విధి నిర్వహణలో తీవ్ర అలసటకు గురికాకుండా చూసేందుకు రూపొందించిన 'అలసట నిర్వహణ నిబంధన (ఎఫ్‌డీటీఎల్)ల నుంచి, విమానయాన సంస్థలకు ఇచ్చిన తాత్కాలిక సడలింపులను ఎత్తివేయాలని నియంత్రణ సంస్థ డీజీసీఏను పైలట్ల సంఘం ఆల్ఫా ఇండియా కోరుతోంది. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు పైలట్లు గుండెపోటుతో మరణించడం ఇందుకు నేపథ్యం. పూర్తి స్థాయిలో ఎఫ్‌డీటీఎల్ నిబంధనల అమలుకు ఒక కాల పరిమితితో కూడి ప్రణాళికను డీజీసీఏ తీసుకురావాలని కోరింది. పైలట్లకు సంబంధించిన బాధ్యతాయుత, పారదర్శక అలసట నివేదిక వ్యవస్థను తీసుకురావాలని సూచించింది. త్రైమాసికం వారీగా ఈ వివరాలను ప్రజలకు వెల్లడించాలనీ విజ్ఞప్తి చేసింది. ఎయిరిండియా పైలట్ ఒకరు, ఆకాశ ఎయిర్‌కు చెందిన మరొక పైలట్ హఠాత్తుగా గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ విధుల్లో లేని సమయంలో మృతి చెందారు. ఎయిరిండియా పైలట్ బాలిలో షెడ్యూల్డ్ రెస్ట్‌లో ఉండగా, ఆకాశ ఎయిర్ పైలట్ ఒకరు శిక్షణలో ఉండగా చనిపోయారు. సవరించిన నిబంధనల ప్రకారం, పైలట్లకు ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకోవడానికి వీలవుతుంది. ఈ నిబంధనల అమల్లో ఎదురవుతున్న సవాళ్లు, పశ్చిమాసియా యుద్ధం అవాంతరాల నడుమ.. విమానయాన సంస్థలకు మరింత సమయాన్ని డీజీసీఏ ఇచ్చింది.

# కీసరలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం, లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**కీసర, మే 2, (నినాదం) :** కీసర సర్కిల్ పరిధి లోని, కీసర డివిజన్‌లో ఉన్న కేబీఆర్ కన్వెన్షన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి చిప్ విప్ పట్నం మహెందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలపై పెళ్లి ఖర్చుల భారం తగ్గుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు,స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యం



కొలను హనుమంత రెడ్డి

**కుత్బుల్లాపూర్, మే 2 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్ స్ప్రింగ్ వుడ్స్ కాలనీలో నిర్వహించిన విరామ కార్య ఓక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ప్రత్యేకంగా సమావేశమై, వారి కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం హనుమంత రెడ్డి కాలనీ అభివృద్ధికి అవసరమైన పనులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్ర నగర్ మే 2(నినాదం):** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్ర నగర్ లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఆర్ డి ఓ వెంకటరెడ్డి, రాజేంద్ర నగర్ జోనల్ కమిషన్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలను పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు ప్రయోజనాత్మకంగా ప్రతిష్టాత్మక పథకాలు అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో రైతులకు రైతు భరోసా రూ.11.96కోట్లు మూడు సీజన్లలో 8209 మంది రైతులకు అందించారన్నారు. రైతు భీమా 4.05కోట్లు 81 మంది కి మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి , రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ,శంషాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



**వికారాబాద్, మే 2(నినాదం) :** వికారాబాద్ పరిధిలోని కొత్తగడి ప్రాంతంలో గల టీజీఎస్ డబ్ల్యూ పాఠశాల, జూనియర్ కళాశాల లో ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పీ ఎస్ లు శనివారం సంద ర్శించారు. ఈ సందర్భంగా వారు పరీక్షల నిర్వహణ తీరును, అభ్యర్థుల కు కల్పించిన కనీస వసతులను భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీ లించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 144 అమలులో ఉందని, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం..!

సీఎం పేరును మరిచిన దుబ్బాక ఎంపీడీవో

మహిళలకు ప్రభుత్వం అనేక సంక్షేమా పథకాలు ప్రవేశపెడుతుంది



**దుబ్బాక, మే2 (నినాదం) :** తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెడుతుంటే, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని జడ్పీ సీఈఓ గణేష్ అన్నారు. శనివారం స్థానిక రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు ప్రజా సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కొత్త పింఛన్లు మంజూరు అవ్వడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం టిఫిన్ సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లు నేరుగా లబ్ధిదారులకు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. దుబ్బాక ఎంపీడీవో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని నరేందర్ రెడ్డి గా పేరు మార్చారు..? సీఎం పేరుని మర్చిపోయిన మండల అభివృద్ధి అధికారి. రైతులు వారి మీద ఆధారపడకుండా ఆయిల్ ఫామ్ పంటను వేస్తే 90 శాతం ప్రభుత్వం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుం దని వారన్నారు. కొత్తగా పింఛన్లు రెండు లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాఖ అధికారి, ఏం సి చైర్మన్ కొంగరి రవి ముదిరాజ్ తోపాటు అధికారులు, అంగన్వాడి కార్మికులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమిష్టి సహకారంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి

ప్రజా సంక్షేమం..అభివృద్ధి లక్ష్యంగా పనిచేయండి

పూర్తి పారదర్శకతతో నిధుల కేటాయింపు

పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రశాంతంగా ముగిసిన కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే

బిఆర్ఎస్ ఖాతాలో నాలుగు కో ఆప్షన్ పదవులు



**పటాన్చెరు, ఏప్రిల్2(నినాదం) :** ప్రజలు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తి పారదర్శకతతో నిర్వహించడంతో పాటు.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పటాన్చెరు శాసనస భ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాలకవర్గానికి సూచించారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమానికి హాజరై ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిఆర్ఎస్ తరపున ప్రతిపాదించిన విష్ణువర్ధన్ రెడ్డి, బండ సోనియా, నిజాముద్దీన్ బాబా, ఆసియా బేగంలు పూర్తి మెజారిటీతో కో ఆప్షన్ సభ్యులుగా ఎంపిక య్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతి కౌన్సిలర్ తమ వార్డు పరిధిలో నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి నిబద్ధతతో పని చేయాలని కోరారు. ఇప్పటికే 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయని.. అతి త్వరలో వీటికి శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. అధికార, ప్రతిపక్షం అని తేడా లేకుండా ప్రతి వార్డుకి సమస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాలని పాలకవర్గానికి సూచించారు. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పరిపాలన అందించాలని సూచించారు. నూతన కోఆప్షన్ సభ్యులకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్, సీనియర్ నాయకులు గడిల శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు మమత, వెంకటేష్, ఆంజనేయులు, రాహుల్ రెడ్డి, ఈశ్వరమ్మ, కిషోర్ రెడ్డి, మంజుల, సంధ్య, నరేందర్ రెడ్డి, పాండు, లత, రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదకరమైన (గొయ్యిని) నేను, నన్ను పట్టించుకోరా

మన గ్రామ ప్రజలకు,
ఎన్నో రోజుల నుండి సేవలు చేస్తున్న



**వెల్దుర్తి, మాసాయిపేట/మే2 (నినాదం):** మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో మెయిన్ రోడ్ మీద గుంత( గొయ్యి) ఎన్నో రోజుల నుండి ఉన్నది నిమ్మకు నీరెత్తినట్లు చూసి చూడనట్లుగా గ్రామపంచాయతీ శాఖ, అదేవిధంగా పట్టించుకోని అధికారులు చూస్తూ పోవడం జరుగుతుందని గ్రామంలో ఒకరికొకరు అనుకుంటున్నారు అనంతరం గ్రామంలో పెద్దమ్మ జాతర ఉంది బయట గ్రామాల ప్రజలు చాలా మంది వస్తారు.ఈ గుంత (గొయ్యి) ప్రమాదకరం స్థాయిలో ఉంది వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంద్రసేనారెడ్డి కోరుతున్నారు

## బాలికకు ఆర్థిక సాయం అందజేశిన బోడిగం శ్రీనివాస్ గౌడ్



**మల్కాజిగిరి, మే 2 (నినాదం) :** మల్కాజిగిరి నియోజకవర్గం వినాయక నగర్ డివిజన్ కు చెందిన రక్షిత అనే 6 సంవత్సరాల బాలిక మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాస్తు జారిపడి తలకు తీవ్ర గాయాలై న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారి హాస్పటల్ ఖర్చుల నిమిత్తం వినాయక నగర్ కు చెందిన అండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బోడిగం శ్రీనివాస్ గౌడ్ పదివేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో ఉన్న వారు ప్రమాదవశాత్తు ఇలా జరగడం వలన వారి చికిత్స కోసం మాకు తోచిన సహాయాన్ని హాస్పిటల్ కి వెళ్లి అందించడం జరిగిందని తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ చేసిన సహాయాన్ని పలువురు స్థానికులు అభినందించారు.

## ప్రజా సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం మొదటి వరుసలో ఉంది

కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్

పథకాలు గరీబోళ్లకు ఆభరణాలు

కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్





**జవహర్ నగర్, మే2 (నినాదం):** ప్రజా సంక్షేమంలో ప్రజల అవసరాలను నెరవేర్చడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే మొదటి వరుసలో ఉందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాపాలన... ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, తోపాటు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి తదితరులు శనివారం కీసర కె.వి.ఆర్ కన్వెన్షన్ హాల్లో 384 మంది లబ్ధిదారులకు నాలుగు కోట్ల 28 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకొని అమలు చేస్తున్న పథకాలు పేద కుటుంబాలకు గరీబోళ్లకు ఎంతగానో అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అలాగే అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం తద్వారా ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మేడిపల్లి, మేడ్చల్, కీసర, ఘట్కేసర్, షామీర్పేట, కాప్రా, మూడు చింతలపల్లి మండల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మలిపెద్దిసుధీర్ రెడ్డి, కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్, కాప్రా ఆర్ఐ సత్యనారాయణ, జవహర్ నగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, నాయకులు రాజు యాదవ్, సాయి, కృష్ణ, మధు, లబ్ధిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

అదనపు కలెక్టర్ కిరణ్మయి



**రంగారెడ్డి బ్యూరో, మే 2 (నినాదం) :** పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని, వారి ప్రవర్తనను సమీక్షిస్తూ సరికొత్త సవాళ్ల నుంచి రక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ లోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సభలో ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్ లు ముఖ్య అతిధులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు అతుక్కుపోకుండా నియంత్రిస్తూ, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 14 సంవత్సరాలు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్ పివి (హెచ్‌పీవీ) టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ టీకా సురక్షితమై, దీర్ఘకాలిక రక్షణను అందిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తూ సహకరిస్తోందని, మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం సైబర్ క్రైమ్‌లు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కిరణ్మయి హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, ఓటీపీలు పంచుకోవద్దని, మోసపోయినట్లయితే వెంటనే 1930 లేదా 1908 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారుదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. మహిళల సంక్షేమానికి ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, తక్కువ ధరలో గ్యాస్ సిలిండర్, రైతులకు రైతు భరోసా, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు రూ.238 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్ సునీత, మండల విద్యాధికారి మనోహర్, ఫరూక్ నగర్ మండల తాహసిల్దార్ నాగయ్య ఎంపీడీవో బన్సీలాల్ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ నాయకుడు లక్ష్మణ్‌ను కలిసిన జిల్లా నాయకులు



**వికారాబాద్, మే 2(నినాదం):** ఈనెల 10 న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాష్ట్ర పర్యటన చెయనున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్ లో నిర్వహించిన సన్నాహక సమావేశానికి హాజరైన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మన్ ను జిల్లా నుండి పాలో న్న పలువురు బీజేపీ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీకోసం పలు విషయాలను పంచుకున్నారు.

# మాదకద్రవ్యాలకు నో చెప్పండి ఆరోగ్య జీవన విధానానికి అవును చెప్పండి

డ్రగ్స్ నివారణకై యాంటీ నార్కోటెక్ బ్యూరో చర్యలు అభినందనీయం

ఆర్మీ డెంటల్ కాలేజీలోమాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ కలెక్టరేట్, మే2 (నినాదం):** మాదకద్రవ్యాలకు నోచెప్పి ఆరోగ్యకరమైన జీవన విధానానికి అవును చెప్పాలని, డ్రగ్స్ నివారణకై యాంటీ నార్కోటిక్ బ్యూరో సేవలు అభినందనీయమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ లోని ఆర్మీ డెంటల్ కాలేజ్ ప్రాంగణంలో మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై మాట్లాడుతూ "మాదకద్రవ్యాలకు నో చెప్పండి... ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అవును చెప్పండి" అని పిలుస్తూ తెలంగాణలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం అక్రమ రవాణా అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్ బ్యూరో కీలక చర్యలు చేపడుతుందని ద్వారా రాష్ట్రంలో ముఖ్యంగా మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో సింథటిక్ డ్రగ్స్ కేంద్రాలు మారుతున్నాయని జాతీయ నార్కోటిక్ సంస్థలు డ్రగ్స్ తయారీ, రవాణా, నిల్వ ముఠాలను టార్గెట్ చేస్తూ పోలీసులు ఈగల్ కోర్సు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారని తెలిపారు. గత ఏడాదిలో అనేక డ్రగ్ ఫ్యాక్టరీలను మూసివేసి భారీగా ఎఫిడ్రిన్ వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో తెలంగాణ పోలీసుల సంయుక్త ఆపరేషన్లో అంతరాష్ట్ర గంజాయి రాకెట్లను డ్రగ్స్ తయారీలో ఉపయోగించే కెమికల్స్ ను అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న ఫార్మా కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటూ కొన్ని యూనిట్లను మూసివేసామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డి అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి చికిత్స తో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ యొక్క ముఖ్య అంశాలు యువతలో అవగాహన పెంపు స్కూలు కాలేజీలో డ్రగ్స్ నిరోధక కార్యక్రమాలను అంతర్ రాష్ట్ర డ్రగ్స్ రవాణా నియంత్రణ చర్యలు తదితర విషయాలను ప్రభుత్వం పోలీసులు కలిపి డ్రగ్ ఫ్రీ తెలంగాణగా తీసుకెళ్లడానికి ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్స్ సరిత చందన మాట్లాడుతూ అందరూ కలిస్తేనే సమాజాన్ని డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చవచ్చునని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడుతూ పట్టుబడితే కఠినమైన చర్యలు ఉంటాయని డ్రగ్స్ వినియోగం గురించి ఎవరికైనా తెలిస్తే 1903 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ పట్ల పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించి పిల్లల భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మోతీ మాట్లాడుతూ చిన్నతనంలోనే మాదకద్రవ్యాలకు గురికాకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టి పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని జవహర్ నగర్ ప్రాంతాన్ని డ్రగ్స్ రహిత జవహర్ నగర్ గా తీర్చిదిద్దుతామని ఇది అందరి వల్ల సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా డిసిపి నరసింహారెడ్డి మాట్లాడుతూ యువతను వ్యసనాల నుండి దూరంగా ఉంచడం ఆరోగ్యకరమైన జీవనశైలని ప్రోత్సహించడం యువత దేశానికి వెన్నెముక లాంటిదని వారు తెలియజేశారు. పోలీస్ నార్కోటిక్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి డ్రగ్స్ రహిత తెలంగాణగా తీర్చిదిద్ది ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని యువతకు సూచించారు. అనంతరం ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, విద్యాశాఖ హేమలత, అసిస్టెంట్ అండ్ సూపరిండెంట్ ముకుంద రెడ్డి, సిడబ్ల్యుసి మెంబర్ రామ్మోహన్, నాగ, జయశ్రీ, జవహర్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ తాసిల్దార్ ప్రవీణ్ కుమార్, అల్వాల్ సిడిపిఓ స్వాతి, కాప్రా మండల ఎంఈఓ నరసింహ, బాల రక్షాభవన్ కోఆర్డినేటర్ తిరుమల దేవి, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి ఇంతియాజ్, ఐ సి డి ఎస్ సూపర్వైజర్స్, అంగన్వాడి టీచర్స్, పిల్లలు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, జవహర్ నగర్ యువత, ఆర్మీ డెంటల్ కాలేజీ విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరంలో ప్రజాపాలన ప్రగతి సమావేశం

**సంక్షేమ పథకాల అమలుకు తగిన నిధుల కేటాయింపు అవసరం**

**డిప్యూటీ మేయర్ సునీల్ రావు**



**కరీంనగర్, మే 2(నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ"లో భాగంగా శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశం రాష్ట్ర గీతంతో ప్రారంభమై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్ర భుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికను వివరించారు. ఈ సందర్భంగా రైతు భీమా, కళ్యాణలక్ష్మీ చెక్కులతో పాటు నగరపాలక సంస్థ పరిధిలోని 38 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 5.46 కోట్ల బ్యాంకు రుణాల చెక్కులు పంపిణీ చేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్ మహిళా సంఘానికి పాస్ బుక్ అందజేశారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల్లోకి వెళ్లినప్పుడు అనేక సమస్యలు బయటపడు తున్నాయని, వాటి పరిష్కారానికి తగిన నిధులు అవసరమని తెలిపారు. నిధుల కొరతతో ప్రజాప్రతినిధులు సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విజయానికి ఆర్థిక వనరులు సమకూర్చడం అత్యవసరమని, అవసరమైన నిధుల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని సూచించారు. పార్టీలు పక్కనపెట్టి కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజా సేవలో ముందుకు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్, మే 02 (నినా దం);** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భ ంగా మంత్రి మాట్లాడుతూ మరియు సంక్షేమమేనని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2 సంవత్స రాల 5 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం 265 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను 2.56 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశా మని, మరణించిన 679 మంది రైతు కుటుంబాలకు 49.96 కోట్ల రూపాయల రైతు బీమా అందించామని వివరించారు. నియోజకవర్గంలో 147 కోట్ల రూపాయలతో 3,515 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఇప్పటికే లబ్ధిదారులకు వివిధ దశల్లో 73 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. గృహ జ్యోతి పథకం ద్వారా 53,963 గృహాలకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా 52,207 కుటుంబాలకు గ్యాస్ సబ్సిడీని అందిస్తున్నామని చెప్పారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కొత్త పింఛన్లను త్వరలోనే మంజూరు చేస్తామని, ఇప్పటికే 13 వేల మందికి కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. రైతులకు మద్దతుగా సన్న వడ్ల కొనుగోలుపై క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 20 కోట్ల రూపా యలకు పైగా నిధులు విడుదల చేశామని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కొత్తపల్లి నుండి హుస్నా బాద్ వరకు, అక్కన్నపేట వరకు నాలుగు వరుసల రహదారి పనులు చేపడుతున్నామని, గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగు నీరు అందించడం తన బాధ్యతని మంత్రి హామీ ఇచ్చారు. తంగేళ్లపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వేగంగా జరుగుతుందని, హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజీతో పాటు త్వరలోనే మెడికల్ కాలేజీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ఎల్లమ్మ చెరువు, అర్బన్ పార్కులను అభివృద్ధి చేస్తామని, వంగరలో నవోదయ విద్యాలయం స్థాపనకు కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా హుస్నాబాద్ విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మి మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు వీడ్కోలు



**జమ్మికుంట, మే 2 (నినాదం) :** గత రెండు సంవత్సరాలుగా జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ను మున్సిపల్ అధికారులు, సి బ్బంది శాలువాలతో సత్కరించి, వీడ్కోలు పలికారు. కమిషనర్ మహమ్మద్ అయాజ్ గత రెండు సంవత్సరాల కాలంలో జమ్మికుంట పట్టణాన్ని అన్ని రంగా లలో ముందుంచి జమ్మికుంట ప ట్టణ పేరును రాష్ట్రంలో పరిచ యం చేసిన వ్యక్తి అని మున్సిపల్ అధికారులు కొనియాడారు. పట్టణంలో ఇంటి పన్ను వసూళ్లలో రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయిలో మొదటి వరుసలో నిలిపిన వ్యక్తి అని వారు అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, జె. ఏ. వో రాజశేఖర్ రెడ్డి, టిపీవో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, ఆర్ ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ లతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కమనీయం.. రమణీయం వెంకటేశ్వర స్వామి రథోత్సవం

**మొక్కులు చెల్లించుకున్న పాడి ఉదయ్ నందన్ రెడ్డి**





**జమ్మికుంట, మే 2 (నినాదం):** వీణవంక మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వీణవంక పున్నమి జాతర బ్రహ్మోత్సవాల లో భాగంగా స్వామివారి రథోత్సవం కమనీయం రమణీయంగా జరిగింది. వందలాదిమంది భక్తుల వెంకటేశ్వర స్వామి నామస్మరణ మధ్య స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగ రంగ వైభవంగా జరిగాయి. రథోత్సవం పై కొలువుదీరిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామిని యాప్ టీవీ అధినేత పాడి ఉద యానంద రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకరీంనగర్ జిల్లాలో పవిత్ర క్షేత్రంగా శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ దివ్య స్థలం లక్షలాది భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన ఆధ్యాత్మిక కేంద్రం అన్నారు. వేయి సంవత్సరాల వైభవ చరిత్ర కలిగిన వీణవంక క్షేత్రంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారు యుగయుగాలుగా భక్తుల మొక్కులు స్వీకరిస్తూ, వారి కష్టాలను తీర్చి, కోరికలు నెరవేర్చే కల్పవృక్షంగా విరాజిల్లుతున్నారని పేర్కొన్నారు. పున్నమి జాతర బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్న ఈ మహాపర్వదినాలలో సర్వోత్కృష్టమైన, అత్యంత పవిత్రమైన రథోత్సవం రోజున స్వామివారు రథారూఢులై భక్తులకు సాక్షాత్కరిస్తున్న ఆ దివ్య మంగళ ఘడియలలోస్వామివారి దర్శన భాగ్యం పొంది, తమ మనసులో నిక్షిప్తమైన మొక్కులను పూర్ణ భక్తిశ్రద్ధలతో చెల్లించుకున్నట్లు భక్తి భావంతో వెల్లడించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తూ ఆలయ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సీఐ సురేష్ బాబుకు యూత్ కాంగ్రెస్ ఘన సన్మానం



**మెట్ పల్లి, మే 2 (నినాదం):** కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు ఇటీవల మెట్ పల్లి పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు ను, శనివారం యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి పట్టణంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన "టఫ్" నాయకులు



**జమ్మికుంట, మే 2 (నినాదం):** ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ ఉద్యమ నేత జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ను మర్యాద పూర్వకంగా కలిసి న టఫ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎక్కటి సంజీవ రెడ్డి. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం పోరాటం చేసిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ సాధన కోసం కష్టపడ్డ వారిని ప్రభుత్వం గుర్తించి ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రయత్నం చేయాలని వారిని కోరినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఏర్పాటు చేయడం జరిగిందని ఇకపై ఉద్యమకారుల సమస్యలను ఈ ఫోరం ద్వారానే చేపడతామని వారికి తెలిపినట్లు సంజీవరెడ్డి పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ త్వరలో కేకే కమిటీ వేయడం జరుగుతుందని ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారని కోదండరాం తెలిపినట్లు సంజీవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టఫ్ నాయకులు బొమ్మకంటి మహేంద్ర చారి తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెండెం సర్వేశం తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి కాంగ్రెస్‌లో వర్గ పోరు



**మెట్‌పల్లి, మే 2 (నినాదం):** కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మళ్లీ భగ్గుమన్నది. మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లింగం రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో అంతర్గత విభేదాలు బహిరంగానికి వచ్చాయి. పార్టీ లోపలి కలహాలు ఒక్కసారిగా బయటపడటంతో స్థానిక శ్రేణుల్లో చర్చనీయాం శమైంది. ఈ నేపథ్యంలో శని వారం యూత్ కాంగ్రెస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమిడి శివ, ఓ పత్రిక ప్రకటన విడుదల చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా పార్టీకి అంకితభావంతో పనిచేసిన జెట్టి లింగంపై ఇటీవల పార్టీలో చేరిన వలస నేతలు విమర్శలు చేయడం తగదు అని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడటానికి ప్రస్తుత నాయకత్వ వైఫ ల్యమే కారణమని ఆరోపించారు. ఇటీవల జరిగిన కో–ఆప్షన్ ఎన్నికల్లో సొంత పార్టీ అభ్య ర్థిని పక్కనబెట్టి ప్రతిపక్షానికి మద్దతు ఇవ్వడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. కష్టకాలంలో కేసులు ఎదుర్కొంటూ పార్టీని నిలబెట్టిన సీనియర్లను విమర్శించే హక్కు వలస నేతలకు లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారిందనీ, కార్యకర్తల్లో ఆందోళన నెలకొన్నదని పేర్కొ న్నారు. ఇదిలా ఉండగా, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వర్గం జువ్వాడి నర్సింగరావు నాయకత్వానికి మద్దతుగా నిలుస్తుండగా, మరోవైపు సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్గపోరును అణిచివేసేందుకు పార్టీ ఉన్నత నాయకత్వం జోక్యం చేసుకోవాలని స్థానిక నేతలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రంజిత్, కమ్మం నాగరాజు, సంకేత్, బానోత్ దేవరాజ్ నాయక్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సేవలకు కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు



**కరీంనగర్, మే 2(నినాదం):** వేసవి నేపథ్యంలో టవల్స్, నీటి సీసాల పంపిణీ వేతనాల పెంపు, బీమా సదుపాయాలపై హామీ కరీంనగర్ 42వ డివిజన్ భగత్ నగర్ లోని సీనియర్ సిటిజన్స్ కేర్ సెంటర్, జెడ్పీ క్వార్టర్స్‌లో యోగా శిక్షకుడు మర్రి రాజేందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సఫాయి కార్మికులకు టవల్స్, నీటి సీసాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై కార్మికుల సేవలను ప్రశంసిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు సఫాయి కార్మికులే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం వేళల్లోనే ప్రమాదాలను ఎదు ర్కొంటూ వారు నిర్వర్తిస్తున్న సేవలు అపూర్వమని అన్నారు. సమాజంలో వ్యర్థాలను తొలగిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అం దిస్తున్న వారి కృషి అమూల్యమని కొనియాడారు. మున్సిపల్ కార్మికుల భద్రత కోసం డ్రైనేజీ పనుల్లో మను షులు దిగకుండా ఆధునిక యంత్రా లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ చర్యల ఫలితంగా కరీంనగర్‌కు జాతీ య స్థాయిలో గుర్తింపు లభించి 'సఫాయి మిత్ర సురక్ష ఛాలెంజ్'లో ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కార్మికులకు అందు తున్న రూ. 16 వేల వేతనం తక్కు వగా ఉందని, కనీసం రూ. 25 వేల వరకు పెంచాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. అలాగే మున్సి పల్ కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆరోగ్య బీమా సదుపాయాలపై కూడా సంస్థ ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. వయోపరిమితి కారణంగా ఉద్యోగాల నుంచి తొలగించే పద్ధతిని మార్చి, అవసరమైతే వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం పాలకవర్గం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వి. మోహన్ రెడ్డి, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## రూరల్ సీఐని కలిసిన ఆలయ చైర్మన్



**జమ్మికుంట, మే 2 (నినాదం):** సాధారణ బదిలీల్లో భాగంగా జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీపై వచ్చిన పులి వెంకట్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీ పై జమ్మికుంట రూరల్ కు వచ్చి బాధ్యతలు స్వీకరించిన పులి వెంకట్ ని మర్యాదపూర్వకంగా కలిసి అపర భద్రాద్రిగా పేరుపొందిన శ్రీ సీతారామ చంద్ర స్వామి చిత్రపటం ముత్యాల తలంబ్రాలు అందజేసి, స్వామి వారి మేమెంటో ను అందించి శాలువాతో సన్మానించడం జరిగిందని తెలిపారు. సమయం చూసుకొని అపర భద్రాద్రి ఆలయ దర్శనానికి రావాలని వారిని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం,యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి..



**మెట్ పల్లి, మే 2 ( నినాదం):** మెట్ పల్లి పరిధిలోని రేగుంట గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... ఏప్రిల్ 30న ఉదయం 10 గంటల సమయంలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గుర్తించారు. వెంటనే చికిత్స నిమిత్తం మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మే 1న సాయంత్రం 7:30 గంటలకు అతను మృతి చెందాడు. వడదెబ్బ కారణంగానే మృతి చెందినట్లు వైద్యులు ప్రాథమి కంగా నిర్ధారించారు. మృతుడి బంధువుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఎటువంటి ఆచూకీ లభించ లేదు. మృతుడికి బంధువులు ఎవరూ రాకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో జవాన్‌గా పనిచేస్తున్న ఎం.డి. నిజాముద్దీన్ (52) దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించినట్లు ఎస్ఐ పి. కిరణ్ కుమార్ తెలిపారు.

## కానిస్టేబుల్ ప్రవీణ్ హోంగార్డ్ నిరంజన్‌లు సస్పెండ్



**సూర్యాపేట ప్రతినిధి, మే 02 నినాదం:** ప్రభుత్వం నిరుపేదలకు అందించే పిడిఎస్ ప్రభుత్వ బియ్యాన్ని దారి మళ్లించి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న నిందితులకు కొందరు పోలీసులు సహకారం అందిస్తున్నారని ఆరోపణల నేపథ్యంలో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పోలీస్ శాఖ సమగ్ర విచారణ చేపట్టింది ఇందులో భాగంగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రవీణ్. హోంగార్డు నిరంజన్ లు అక్రమార్కులకు సహకరించి నట్టు పై అధికారుల జరిపిన విచారణ లో తేలడంతో శనివారం ఇరువురిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కే నరసింహ తెలిపారు.

## తెలంగాణ జన సమితి పార్టీ 4వ ప్లీనరీ విజయవంతం చేయండి : రాజు



**హుజురాబాద్, మే 02 (నినాదం):** తెలంగాణ జన సమితి పార్టీ 4వ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజయవం తం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు పిలుపునిచ్చారు. శనివారం హుజురాబాద్ పట్టణంలో ప్లీనరీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముక్కెర రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిత్యం పోరాడుతున్న ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి అని అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారధి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి ప్రజాపక్షాన నిలుస్తోందని ఆయన గుర్తుచేశారు. ధన ప్రవాహంతో సంబంధం లేని నైతిక రాజకీ యాల కోసం టీజేఎస్ కృషి చేస్తోందని ము క్కెర రాజు పేర్కొన్నారు. కాళోజీ నారాయణ రావు, ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహ నీయులు ఆశించిన తెలంగాణ పునర్నిర్మా ణమే మా లక్ష్యం. ఆ దిశగా అడుగులు వేస్తూ, పారదర్శకమైన పాలన కోసం ప్రజలను చైతన్యపరుస్తున్నాం అని ఆయన వివరించారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన 4వ రాష్ట్ర ప్లీనరీ సమావేశానికి కరీంనగర్ జిల్లా నుంచి కార్యకర్తలు, నాయకులు మరియు మేధావులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ ప్లీనరీ ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మోరె గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె సతీష్ యాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు అరికిల్ల భానుచందర్, నాయకులు సాయి మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాయిదా పడ్డ కో ఆప్షన్ ఎన్నిక

**పారదర్శకతతో కోఆప్షన్ ఎన్నిక నిర్వహిస్తాం**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్**



**జమ్మికుంట మే 2 (నినాదం):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించవలసిన కోఆప్షన్ ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుండి కో ఆప్షన్ పోటీకి వచ్చిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగి ఉండడంతో పాటు వారి అనుభవాన్ని పరిగణలోనికి తీసుకొని సామాజిక సమతుల్యత పాటించవలసిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించే విధంగా విధంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి 19 మంది అభ్యర్థులు ఉండడం వల్ల ఎన్నిక ప్రక్రియలో కీలకమైన ఎ పిక్ ధ్రువీకరణను సక్రమంగా పారదర్శకంగా నిర్వహించడం కోసం సమయం తీసుకోవాల్సి వచ్చింది అన్నారు. ఎన్నిక ప్రక్రియలో ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తోపాటు సీనియర్ నాయకులతో చర్చించి వారి సలహాలు సూచనలు తీసుకొని తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పాలకవర్గం మీద ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రధాన లక్ష్యన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేసి కో ఆప్షన్ ఎన్నికను పారదర్శకతతో నిర్వహిస్తామని చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు...



## మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున స్వామి




**జమ్మికుంట, మే 2 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన కమిషనర్ల బదిలలో శనివారం నూతనంగా బదిలీపై వచ్చిన గుట్టల మల్లికార్జున స్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పట్టణ అభివృద్ధి కొరకు ప్రజల సహకారంతో ముందుకు కొనసాగుతామని పేర్కొన్నారు. మేనేజర్ జి.రాజిరెడ్డి, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్‌కుమార్, టిపిబీవో దీపిక, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, ఆర్ ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి



**హుజురాబాద్,మే02(నినాదం):** హుజూరాబాద్ మండలం సింగపూర్ గ్రామ పరిసర ప్రాంతంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని అతివేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో, ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని జూపాక గ్రామానికి చెందిన కేతిరి విక్రమ్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. స్థానికుల వివరాల ప్రకారం, విక్రమ్ రెడ్డి సాధారణంగా తన పనుల నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే పరిసర ప్రాంతాల ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థ లానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమా దానికి కారణమై ఉండవచ్చని అనుమానిస్తూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో జూపాక గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామస్థులు తరచూ ఈ రహదారిపై వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, వేగ నియంత్రణ చర్యలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

## మెట్‌పల్లికి నూతన మున్సిపల్ కమిషనర్



**మెట్ పల్లి, మే 2: ( నినా దం):** మెట్‌పల్లి మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా శ్రీ డి. శ్రీనివాస్ గౌడ్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి, పుష్పగు చ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కమీ షనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించ డంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# నేడే నీట్ పరీక్ష...

## ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**భూపాలపల్లి ప్రతినిధి, మే 02(నినాదం):** రాష్ట్ర వ్యాప్తంగా నేడు(ఆదివారం) నిర్వహించనున్న వైద విద్యా ప్రవేశ పరీక్ష (నీట్) పరీక్ష జిల్లాలో కొనసాగనుంది. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. నీట్ పరీక్ష నిర్వహణకు సంబందించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భూపాలపల్లి సిటీ కో ఆర్డినేటర్ డా. ఎ.రమణారావు తెలియజేసారు. పట్టణంలో మొత్తం 375 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని, వారి కోసం పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 240 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 135 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి కేటాయించినట్లు కోఆర్డినేటర్ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు ఉదయం 11.00 గంటల నుండి మ.1.30 గంటల వరకు అనుమతిస్తారని నిర్ణీత సమయం దాటిన తరువాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. కావున విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చెకోవాలని, ఎన్టీఏ వారు సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పరీక్ష పూర్తి చేసుకోవాలని జిల్లా పరీక్ష కోఆర్డినేటర్ వివరించారు.

# అన్‌సాన్‌పల్లిలో అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ

## పాలకులు పట్టింపు కరువు, బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ రాజు





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, మే 02(నినాదం):** స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు గడిచినా ఇప్పటి వరకు అన్‌సాన్‌పల్లి గ్రామంలో డ్రైనేజి వ్యవస్థ లేదని గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ రాజు మండిపడ్డారు. ఏండ్ల తరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలను మోసం చేస్తూ గ్రామ అభివృద్ధిని ఆమడ దూరంలో పెడుతూ ప్రజలకు అందుబాటులో లేకుండా పరిపాలించడం పాలకుల తీరు అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి కాలంలోనే ఇలా ఉంటే ప్రజలు నిత్యం నడిచే రోడ్లపై నీరు వర్షాకాలంలో రోడ్లుపైకి బురద మట్టి పేరుకుపోయి దోమల కారణంగా మలేరియా వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు పాలకవర్గానికి విన్నవించినా గ్రామ సభల్లో మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఆన్ సాన్ పల్లి గ్రామంలో శాశ్వత డ్రైనేజి వ్యవస్థను నిర్మించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారనీ ఆయన పేర్కొన్నారు.

# తండా దేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

## తండా సర్పంచ్ ధరవత్ పద్మ రూప్లనాయక్





**డోర్నకల్ /మరిపెడ మే 02(నినాదం):** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం అమృ నాయక్ తండా గ్రామపంచాయతీ, రాము తండాలోని ప్రజలు దైవచింతనలో మునిగిపోయారు. తండాలలో ప్రతిష్టింప చేస్తున్న బొడ్రాయి, పోతురాజులు,మారమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో వేద పండితులు గరుడ గోపాల స్వామి వేదమంత్రోత్సర్ణాలతో తండా ప్రజలు అందరూ అగ్నిగుండా హోమాలు, కుంకుమ పూజ, లక్ష్మీదేవి, ఆంజనేయుని పూజలను తండా సర్పంచ్ ధరవత్ పద్మ రూప్ల నాయక్ సమక్షంలో తండావాసులు అందరూ పూజలు నిర్వహించారు.తండా దేవతలను నెలకొల్పినప్పుడు వారి కరుణాకటాక్షాలతో తండాలు సుభిక్షంగా ఉంటాయన్నారు.తండాలోని ప్రజలు ఆ భక్తి పరవశంలో మునిగిపోయారు.ఆ గ్రామదేవతల ఆశీస్సులు తండా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు తలపెట్టిన కార్యాలు విజయవంతం అయ్యే విధంగా దీవించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ, కమిటీ మెంబర్స్ వెంకన్న,శ్రీను,వినోద్,బాలాజీ, అశోక్,రూప్ల, ధర్మ, తండా ప్రజలు,యువత భక్తి పరవశంలో మునిగారు.

# ప్రజా పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ ప్రతినిధి, మే 2 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ప్రజలకు చెప్పని అనేక కొత్త కొత్త పథకాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భావనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన నల్గొండ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామ ,మండల స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు మహిళలకు ఉచిత సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు ఎల్పిజి గ్యాస్, వంటి ఆరు గ్యారెంటీలను ఇచ్చి అమలు చేస్తున్నదని, అంతేకాక ఇవ్వని వాగ్దానాలు, దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వపరంగా మధ్యాహ్న భోజనం అందించనుందని తెలిపారు. ఉదయం రాజి జావ, మధ్యాహ్నం భోజనం ,సాయంత్రం సమయంలో అల్పాహారం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. ఇది తెలంగాణలో విప్లవాత్మకమైన పథకం అని అన్నారు. ఈ పథకం కింద సంవత్సరంలో 1400 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు .వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉచిత విద్యుత్తు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేయడం జరిగిందని, తిరిగి తమ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. నల్గొండ పట్టణంలో రామగిరి టెంపుల్ నుండి దేవరకొండ రోడ్డు వరకు 15 కోట్ల రూపాయలతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నామని న్యాక్ కేంద్రం ద్వారా టైలరింగ్, మెకానిక్ ఇతర ట్రేడులలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాము. ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ , రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర పవార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# యువత మత్తు పదార్థాలకు నో చెప్పండి..
# భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరండి

## కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ప్రతినిధి, మే 2 (నినాదం):** యువత మత్తు పదార్థాలకు నో చెప్పండి – భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించండి అనే జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. శనివారం పట్టణంలోనే కాక్ టవర్ సెంటర్ వద్ద పోలీస్ శాఖ, ఉమెన్ ఓ చైల్డ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం సమాజానికి తీవ్ర హానిని కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు స్నేహితుల ప్రభావం, ఆసక్తి లేదా ఒత్తిడి కారణంగా డ్రగ్స్ వైపు మళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలు దెబ్బతింటాయని, మానసికంగా ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు.అలాగే చదువుపై దృష్టి కోల్పోవడం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ ఆఫర్ చేసినప్పుడు స్పష్టంగా "కాదు" అని చెప్పాలని, చెడు స్నేహితులను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే 100 లేదా 1908 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ వినియోగం చట్టపరంగా నేరమని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శ్రీ శివరాం రెడ్డి , టూ టౌన్ సిఐ శ్రీ రాఘవరావు గారు, వన్ టౌన్ సిఐ శ్రీ రాజశేఖర్ రెడ్డి , ట్రాఫిక్ సిఐ శ్రీ మహాలక్ష్మయ్య , ఉమెన్ ఓ చైల్డ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సే నో టు డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ



**హనుమకొండ, మే2, (నినాదం):** ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా " సే నోటు డ్రగ్స్" అనే అంశంపై శనివారం ఉదయం అవగాహన ర్యాలీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ హనుమకొండ అదాలత్ సర్కిల్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు కొనసాగింది. తొలుత ర్యాలీని వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డిడబ్ల్యుఓ విశ్వజ పోలీస్, ఎక్సైజ్ అధికారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఈగల టీం, ఆశా వర్కర్లు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు చేయాలంటూ బిఆర్ఎస్ భారీ ధర్నా

## ధర్నాకు హాజరైన మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

## రైతులతో పెట్టుకుంటే ప్రభుత్వానికి పుట్టగతులుండవ్



**అమరచింత, మే 2 (నినాదం):** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూర్ గాంధీ చౌరస్తాలో పార్టీ శ్రేణులు చేపట్టిన భారీ ధర్నాకు ఆయన హాజరయ్యారు.వడ్ల కొనుగోలు విషయం లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు అన్యాయం చేస్తే సాహించేది లేదని హెచ్చరించారు. మక్తల్ నియెజికవర్గం లో ఎక్కడ రైతులకు అన్యాయం జరిగిన అండగా ఉంటానని, రైతుల ధాన్యాని వెంటనే కొనుగోలు చేయాలనీ లేదంటే ముమ్ముందు చాలా ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు , రైతులని పొట్ట కొట్టినవాళ్ళు బాగుపడినట్లు చరిత్ర లో లేదని గుర్తు చేశారు.మాటలు కోటలు దాటుతున్నాయి, వడ్ల కొనుగులో కేంద్రాలు దినపత్రికలో లో ఫోటో లకే పరిమితం అయితున్నాయి కానీ రైతుల నుండి వడ్లు కొనుగోలు చేయడం లేదు అని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికి ప్రభుత్వం నిమ్మకు నిరీతనట్టు ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు . ఈ కాంగ్రెస్స్ ప్రభుత్వం లో ఏ వర్గం వారికీ కూడా న్యాయం జరగడం లేదని, రైతుల పట్ల ఈ ప్రభుత్వం కపట ప్రేమ చూపడం ఆపి ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలని ఆచరణలోకి తేవాలని చెప్పారు.. అనంతరం ఎం. ఆర్. ఓ కార్యాలయ సిబ్బంది ఆర్ ఐ కి పత్రం అందచేసి రైతులకు న్యాయం చేయాలనీ లేదా మళ్ళీ పెద్ద ఎత్తున్న నిరసన కార్యక్రమం చేస్తామని తెలిపి ధర్నా విరమించారు.ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, రేచింతల మాజీ సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, వీరేశలింగం, మాజీ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ కొత్త బోయ శేఖర్ జానకి రాముడు మాజీ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ చర్ల మాసన్న తో పాటు ఆత్మకూరు మండల రైతులు బి. ఆర్. ఎస్ మున్సిపల్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సన్మానం



**కమలాపూర్ మే 2 (నినాదం):** మొన్న వెలువడిన పదవ తరగతి ఫలితాలలో మాదన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదివిన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయు లను గంగు ప్రభాకర్ రావు శనివారం శాలువాలతో సత్కారం అభినందించారు.చేశారు. విద్యార్థినిలకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రభాకర్ రావు మాట్లాడుతుకు చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్నారు. చదువు పరంగా ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉంటే సాధ్యమైన సాయం అందచేసి మీపై చదువులకు అండగా ఉంటాననిహామీ ఇచ్చారు.అదేవిధంగా గొప్పగా చదివి మీ తల్లి తండ్రులకు మన ఊరికి మంచిపేరు తేవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థిని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కత్తి రమేష్,అమ్మ ఆదర్శ పాఠశాల చేర్మెన్ ఎగ్గడి రజిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న,సి ఎ రజిత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

## రైతులకు అండగా అనేక సంక్షేమ పథకాలు

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**భూపాలపల్లి ప్రతినిధి, మే 02(నినాదం):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి వ్యవసాయ రంగానికి పెద్దపీఠ వేస్తుంది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం దండగ కాదు పండగ అని భావించేలా రైతులకు అండగా నిలబడుతున్నామని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా అనేక వ్యవసాయ ప్రోత్సాహక పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. జిల్లాలో 30 వేల ఎకరాలకు భూమి హక్కులు లేక రైతుల ఇబ్బందులు పడుతున్నారని సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి భూ హక్కు పట్టాలిస్తామని తెలిపారు. సాదా బైనామా భూములకు కూడా పట్టాలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు పట్టాలిస్తే రైతు కంట ఆనందం వెల్లివిరుస్తుందని పేదలు దున్నుకునే భూములకు పట్టాలు ఇచ్చేందుకు సీఎం అంగీకరించారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నట్లయితే అటువాటికి శాశ్వత భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అట్టి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 12 కోట్లతో ఎమ్మారై, 3.40 కోట్లతో సిటీ స్కాన్, 40 లక్షలతో వెంటి లేటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 165 రకాల పరీక్షలు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 26 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మిస్తున్నామని, అలాగే 50 కోట్లతో ఏటీసీ భవనం నిర్మించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు జిల్లా యంత్రాంగం ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీలు కచ్చితంగా జిల్లాను అభివృద్ధి చేయాలని అభివృద్ధిలో మనందరం పోటీ పడాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జిల్లాలో దిగ్విజయంగా జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి నుండి గ్రామీణ ప్రాంతం వరకు ఈ కార్యక్రమాలు అమలు జరుగుతున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన కల్పించామని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, అభివృద్ధి కోసం ఇన్నోవేషన్ ఐడియాలు అమలు చేయాలని తెలిపారు. అనంతరం నేతన్న భద్రత భీమా క్రింద ఇద్దరికి 10 లక్షలు పంపిణీ చేశారు.

అలాగే దత్తత సహాయ కేంద్రం హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య , అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, కౌన్సిలర్లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల సిండికేట్ మాయాజాలం !

## సిండికేట్ వ్యాపారులు చెప్పిన గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు !


## మద్యం దుకాణాదారుల చెప్పు చేతల్లో ఎక్సైజ్ అధికారులు !

## తక్కువ ధరకు అమ్మితే కేసులు పెడతామని బెదిరింపులు



**కమలాపూర్ మే 2 (నినాదం):** మండలంలో ఎక్సైజ్ శాఖ అధికారులు మండలంలోని రెండు గ్రామాల్లో ఇటీవల గొలుసు దుకాణాలలో చేసిన దాడులు చర్చకు దారితీశాయి. గూడూరు, మర్రిపల్లిగూడెం గ్రామాల్లోని బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు.గొలుసు దుకాణాలు నడుపుతున్న వ్యక్తులను హనుమకొండ ఎక్సైజ్ కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఈ రెండు గ్రామాల్లోనే జరిగిన దాడుల వెనుక మద్యం దుకాణాల సిండికేట్ మాయాజాలం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండలంలో కమలాపూర్ మండల కేంద్రంలో మూడు, శనిగరంలో ఒకటి, ఉప్పల్ లో ఒకటి, అంబాల లో ఒకటి, మొత్తం ఆరు మద్యం దుకాణాలుఉన్నాయి. ఈ ఆరు మద్యం దుకాణాల యాజమానులు సిండికేట్‌గా ఏర్పడి మండలంలో ఉన్న గ్రామాలను తలా కొన్ని పంచుకుని గొలుసు దుకాణాలకు ఎం ఆర్పీ రేట్ల కంటే అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటు వ్యాపారం చేస్తున్నారు.ఒక బీర్‌పై 20 రూపాయలు, క్వార్టర్‌పై 15 రూపాయలు ఎంఆర్పీకి అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఎం ఆర్ పి కంటే ఎక్కువ ధరకు అమ్మినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదననే ఆరోపణలు ఉన్నాయి.ఈ సిండికేట్ ఏర్పాటులో ఎక్సైజ్ శాఖకు చెందిన ఒక అధికారి పాత్ర కూడా ఉందనే విమర్శలు బలంగా మండలంలో వినబడుతున్నాయి.ఈ మధ్య కాలంలో మండలంలోని ఒక వైన్స్ యజమాని సిండికేట్‌కు భిన్నంగా వ్యవహరిస్తూ ఎంఆర్పీ ధరలకే మద్యం సరఫరా చేయడం ప్రారంభించాడు. దీంతో గూడూరు, మర్రిపల్లిగూడెం బెల్ట్ షాపుల యజమానులు ఆ వైన్స్ నుంచి మద్యం తెచ్చుకుని స్వల్ప లాభాలతో విక్రయాలు ప్రారంభించారు. ప్రజలకు తక్కువ ధరకు మద్యం అందడంతో ఆ షాపులకు గిరాకీ పెరిగింది.ఎం ఆర్ పి ధరలకు మద్యం అమ్మడం మిగితా సిండికేట్ వ్యాపారులకు గిట్టడం లేదు.తమ అధిక లాభాలకు గండి పడుతుందని భావించిన మిగతా వైన్స్ యజమానులు వారి పలుకుబడి ని ఉపయోగించి ఎక్సైజ్ అధికారులను రంగంలోకి దింపారు.దీంతో ఎంఆర్పీకి మద్యం అమ్ముతున్న గూడూరు, మర్రిపల్లిగూడెం బెల్టు షాపులపై దాడులు జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇన్నాళ్లూ అధిక ధరలకు అమ్మినప్పుడు పట్టించుకోని అధికారులు, ఎంఆర్పీకి అమ్మడం మొదలు పెట్టగానే దాడులు చేయడం ఏంటని ప్రజలు విమర్శించారు.అధిక ధరలకు పట్టించుకోని అధికారులు ఎంఆర్పీకి తెచ్చి స్వల్ప లాభంతో అమ్మితే దాడులు చేసి కేసులు పెడతామని బెదిరించడం వెనుక మద్యం సిండికేట్ మాయాజాలం ఉందనే విమర్శలు బలంగా వినబడుతున్నాయి. గ్రామాల్లో గొలుసు దుకాణాలు నడపడమే చట్టవిరుద్ధమే చట్టం అందరికి ఒకేలా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని షాపులపై ఒకేలా చర్యలు తీసుకోవాలి,కానీ ఎంపిక చేసిన రెండు గ్రామాలపైనే దృష్టి పెట్టడం, సిండికేట్‌కు అనుకూలంగా ఉన్న షాపులను వదిలేయడం వెనుక ఆంతర్యం ఏమిటో అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, సిండికేట్ ఆగడాలకు అడ్డుకట్ట వేసి ఎం ఆర్ పి ధరలకే మద్యం విక్రయాలు జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**హనుమకొండ, మే 2, (నినాదం):** తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో మొత్తం 21 రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వేసవి శిక్షణ శిబిరానికి 350 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరమని, ఇది యువత మానసిక ఉల్లాసం ఆసక్తిని పెంచుతుందనీ తెలిపారు. పిల్లలు క్రీడలలో రాణించేలా తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే కాకుండా, భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతాయని ఆయన స్పష్టం చేశారు. యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుంటూ ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారి ప్రశాంత్,నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కోచ్ లు ,క్రీడాకారులు,వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్తుని అరెస్ట్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైమ్, సిసిఎస్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ లో సైబర్ నేరస్తున్ని అరెస్టు చేసినట్లు భూపాలపల్లి పట్టణ సిఐ డి. నరేష్ కుమార్ తెలిపారు. వివరాలలోకి వెళితే జిల్లా కేంద్రానికి చెందిన ఓ భాదితుడు ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపనీ లోన్ ద్వారా ట్రాక్టర్ ని కొనుగోలు చేశాడు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో వరంగల్ పట్టణానికి చెందిన సైబర్ నేరస్తుడు రాయిశెట్టి అనిల్, భాదితునికి ఫోన్ చేసి ఆ ప్రైవేట్ ఫైనాన్స్ కంపనికి చెందిన వాడినని నమ్మించి, ఆ లోన్ వాయిదా డబ్బులను వెంటనే కట్టాలని, లేకుంటే ట్రాక్టర్ ని తీసుకుపోతామని బెదిరించగా భాదితుడు దానిని నమ్మి ఫోన్ పే ద్వారా రూ. 90వేలు వెంటనే అతనికి ట్రాన్సఫర్ చేశాడు. కొద్ది రోజులకి లోన్ వాయిదా డబ్బులు కట్టాలని సదరు ఫైనాన్స్ కంపనికి చెందిన వారు ఫోన్ చేయడంతో భాదితుడు సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయాడని గ్రహించి సైబర్ హెల్ప్ లైన్ నంబరు 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు పైన భూపాలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి నేరస్తున్ని అరెస్టు చెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరానికి గురి అయితే వెంటనే 1930కి కాల్ చేసి గాని, సైబర్ క్రైమ్ పోర్టల్ https://cybercrime.gov.in ద్వారా గాని ఫిర్యాదు చేసి, తగు ఆధారాలతో పోలీసు స్టేషన్ ను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో
# ప్రజావాణి

**భూపాలపల్లి ప్రతినిధి, మే 02(నినాదం):** కాటారం ఇంచార్జి సబ్ కలెక్టర్ హరికృష్ణ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 4 సోమవారం నుండి ప్రజావాణి నిర్వహించనున్నట్లు కాటారం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలు, వినతుల సమర్పణ కోసం సంబంధిత ఆధార పత్రాలతో హాజరై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నినాదం
ఆదివారం
3 మే 2026
ninadam.in




# ఓఆర్ఆర్ ప్రమాద బాధితులకు కేటీఆర్ నివాళి

## ఉస్మానియా మార్చురీ వద్ద కుటుంబ సభ్యులకు పరామర్శ

## సిరిసిల్లకు తరలిన మృతుల భౌతిక కాయాలు

**సిరిసిల్ల, మే 2(నినాదం):**
సిరిసిల్లలో తీవ్ర విషాదాన్ని నింపిన ఔటర్ రింగ్ రోడ్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఉదయం పరామర్శించారు. నిన్న జరిగిన ఈ ఘోర ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి చేరుకున్న ఆయన, మృతుల పార్థివ దేహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పించారు.అనంతరం, అక్కడ ఉన్న మృతుల కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడారు. ఆత్మీయులను కోల్పోయి కన్నీరుమున్నీరవుతున్న వారిని ఆయన ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో తాను వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఇలా అకాల మరణం చెందడం తీరని లోటు అన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం మరియు ఇతర అధికారిక ప్రక్రియలు పూర్తయిన తర్వాత, ఆరుగురి మృత దేహాలను అంబులెన్స్‌లలో వారి స్వగ్రామమైన సిరిసిల్లకు తరలించారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను తరలించే వరకు కేటీఆర్ అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ విషాద ఘటనతో అటు సిరిసిల్ల నియోజకవర్గంలోనూ, ఇటు ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి.



# లిటిల్ స్కాలర్స్ గ్రామర్ స్కూల్ లో విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులు

## చైతన్య, నాజ్రీన్ అద్భుత ఫలితాలతో పాఠశాలకు కీర్తి - ప్రిన్సిపాల్ బి.ప్రభావతి

**పెబ్బేరు, మే 2 (నినాదం):**
ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ మార్చి/ఏప్రిల్ వార్షిక పరీక్షా ఫలితాలలో పెబ్బేరు పట్టణ కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. ఈ ఫలితాలలో పాఠశాలకు చెందిన విద్యార్థి కె. చైతన్య 600 మార్కులకు గాను 551 మార్కులు సాధించగా, నాజ్రీన్ 549 మార్కులతో అద్భుత ఫలితాన్ని నమోదు చేశారు. అదేవిధంగా మొత్తం 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 14 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ బి.ప్రభావతి, ప్రధాన సలహాదారు ఎం.వెంకటయ్య శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి చేసి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ప్రభావతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# మీ వెంటే మేమున్నాం.. మీ కష్టాలను తీరుస్తాం!

## బోదులబండ ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి అభయం



**ఖమ్మం ప్రతినిధి, నేలకొండపల్లి మే 2 (నినాదం )**
"మీ కష్టాలను వినేందుకు, మీ కన్నీళ్లు తుడిచేందుకే ప్రభుత్వం మీ గడప వద్దకు వచ్చింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు మేము విశ్రమించం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన పాల్గొని, జనంతో నేరుగా మమేకమయ్యారు.



### అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు అతీతం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించే తమ ప్రభుత్వం 'ప్రజల వద్దకే పాలన'ను తీసుకువచ్చిందని చెప్పారు. "రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మే నెలాఖరులో రెండో దశ మంజూరు చేస్తాం. ప్రతి సోమవారం నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం" అని స్పష్టం చేశారు.

### భూ సమస్యలకు చరమగీతం

భూ సమస్యల ద్వారా రైతులు పడుతున్న ఇబ్బందులను రాబోయే రెండు నెలల్లో పరిష్కరించి, రైతులకు మేలు చేకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర్‌తో కలిసి మంత్రి గంటల తరబడి ప్రజల మధ్యే ఉండి వందలాది మంది ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతి వారం దీనిపై సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.



# డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం.. భావితరాలకు భవిష్యత్తునిద్దాం

## జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్ లా మారాలి**

**ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు సైతం పాటించాలి**

**డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో 2కె రన్**

**ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు,యువత, విద్యార్థులు,పోలీస్ అధికారులు,సిబ్బంది**

**రాజన్న సిరిసిల్ల మే 2 (నినాదం):**
డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు.డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన 2K రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి పాల్గొన్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.డ్రగ్స్,గంజాయి నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి పౌరుడూ బాధ్యతగలవారిగా వ్యవహరించి,డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చడంలో భాగస్వామ్యం కావాలన్నారు.
విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పక్కా ప్రణాళికతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు , కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతినడంతో పాటు,ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుందని చెప్పారు.అలాగే డ్రగ్స్ వినియోగం శారీరక నష్టాలకే పరిమితం కాకుండా మానసిక సమస్యలు, సామాజిక రుగ్మతలను కూడా పెంచుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి , యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాధక ద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మత్తుపదార్థాలకు సంబందించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుదన్నారు.

### ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విద్యార్థులకు , వాహనదారులకు , ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలన్నారు.కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేయవద్దన్నారు.మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులతో పాటుగా వాహన యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.




### అనంతరం ర్యాలీ కి వచ్చిన విద్యార్థులతో,క్రీడాకారులతో ప్రతిజ్ఞ..

నేను మాదకద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలక భాగ్యస్వామి అవుతానని, డ్రగ్స్ వాడటం వలన కలిగే దుష్పరిమానాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మిన, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తానని, డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తానని డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామ్యం అవుతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను."
ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి,సి.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వర రావు, ఎస్.ఐ లు శ్రీకాంత్, డిసిపిఓ కవిత, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, క్రీడాకారులు,యువత, ప్రజలు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

## టాలెంట్‌ను ప్రోత్సహించే విధంగా మార్పులు




ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది. నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.



# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు

రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్‌లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

# జూన్ 26న లెనిన్ విడుదల



'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెర పడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. జూన్ 26న 'లెనిన్' సందడికి మార్గం సుగమమైంది.




NINADAM CINEMA

# అది నా అదృష్టం

ప్రతిసారి తను పోషించే పాత్ర.. కథను ముందుకు నడిపించేదిగా ఉండాల్సిన అవసరం లేదని అంటోంది అందాల తార రుక్మిణీ వసంత్. అందం, అభినయంతో పాటు వైవిధ్యమైన కథలతో కుర్రకారుని కట్టిపడేస్తున్న భామ ఈమె. గతేడాది 'కాంతార: చాప్టర్ 1' లాంటి మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకొని ఈ ఏడాది మరిన్ని అదిరిపోయే కథలతో తెరపై మెరవడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం 'టాక్సిక్'తో బిజీగా ఉన్న ఈ నాయిక.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.
"నేను సినిమాల్ని కేవలం ఒక్క అంశంపైనే ఆధారపడి ఎంపిక చేసుకోను. ఎన్నో విషయాల్ని పరిగణనలోకి తీసుకొని.. సమగ్రమైన నిర్ణయం తీసుకుంటాను. ఇందులో మొదటి అంశం కథ. అంటే మనం చెప్పబోయే కథ ప్రేక్షకులకు మరో ప్రపంచాన్ని పరిచయం చేసేలా ఉండాలి. నేను ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే మరో అంశం నేను పోషించే పాత్ర.. అది ప్రయాణించే తీరు. అలాగని కథనానికి సంబంధించిన ప్రతి సందర్భంలోనూ నేను నటించే పాత్రనే కీలకంగా ఉండాలనే నియమాలు లేవు. కానీ ఆ పాత్రలో నటించాకా నాకు మరో మంచి అవకాశం రావాలి".
"చిత్రపరిశ్రమకు వచ్చిన తక్కువ రోజుల్లోనే అగ్రతారలతో కలిసి పనిచేసే అవకాశం రావడం ఉత్సాహంగా అనిపిస్తుంది. ముఖ్యంగా ఇతరులకు అవకాశాలు కల్పించే వ్యక్తులతో వర్క్ చేయడం నా అదృష్టం. నేను కలిసి పనిచేసే ప్రతి హీరో ఏదో ఒక విషయంలో తమదైన ప్రత్యేకతను కలిగి ఉంటారని నాకు తెలుసు. వారు మీ ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం ఇస్తారు. 'కాంతార 2' సెట్‌లో రిషబ్ శెట్టి చాలా ప్రోత్సాహకరంగా ఉండేవారు" అన్నారు రుక్మిణీ.


# పృథ్వీరాజ్ సుకుమారన్... ఐ నోబడీ



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోరు అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజికతోఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.

# ఫ్యాన్స్ నుంచి డబ్బులు గుంజడం సరికాదు

## దర్శకుడు రవిబాబు సంచలన కామెంట్స్



వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్. ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787